హిజ్రీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!




AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 6, Issue: 38 December - 2009

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى


## మనిషిగా మారిన ఒక దేవుడు

హిరా గుహలో నెరవేరిన

## బైబిల్ ప్రవచనం

## హిజ్రీ సంవత్సరాది




IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية


ఉచితం

وَالْأَرْضَ مَدَدْنَاهَا وَأَلْقَيْنَا فِيهَا رَوَاسِيَ وَأَنبَتْنَا فِيهَا مِن كُلِّ زَوْجٍ بَهِيجٍ (٧)
تَبْصِرَةً وَذِكْرَىٰ لِكُلِّ عَبْدٍ مُّنِيبٍ (٨)





“మేము భూమిని పరిచి ఉంచాము. అందులో పర్వతాలను ప్రతిష్ఠించాము. ఇంకా మేమందులో రకరకాల రమణీయమైన (జంట) వస్తువులను ఉత్పన్నం చేశాము - అల్లాహ్ వైపునకు రుజువర్తనుడయ్యే ప్రతి దాసునికి బోధనగా, జ్ఞాపికగా!”

(దివ్య ఖుర్ఆన్ - 50: 7,8)







# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 6, ISSUE: 38
DECEMBER 2009

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhammad Azeezur Rahman

EXECUTIVE EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONES
M.Azeezur Rahman
66104547
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc-kw.com

DESIGN
Noushad Zainulabdeen



مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072




ఈ సంచికలో...


దృక్పథం ........ 2
ముహర్రమ్ ........ 3
హిరా గుహలో.... ........ 4
ఐ.పి.సి వార్తలు ........ 7
మనిషిగా మారిన.... ........ 8
ప్రతిఘటన ........ 10
మానవ సృష్టి ఒక.... ........ 11
సమాజ నియమాలు ........ 12
సీరత్ క్విజ్ ........ 13
ఇస్లాం దృష్టిలో సమాధుల.... ........ 14
ముహర్రమ్‌లో.... ........ 16
దయా సాగరుడు ........ 18
ఉత్తరాలు ........ 20

◆ السنة الهجرية ◆ بدعيات المحرم ◆ بشارات عن محمد ﷺ في الكتاب المقدس ◆ أخبار اللجنة
◆ من الباطل إلى الحق (قصة أمه البوذية) ◆ المصائب في سبيل الدعوة ◆ تخليق الإنسان في القرآن
◆ آداب و أحكام الصلاة ◆ أسئلة عن السيرة ◆ تقليد الامرأة المسلمة
◆ إبطال عبادة القبور في الإسلام ◆ ماذا علينا أن نفعل في المحرم ◆ الرحمن الرحيم ◆ رسائل



بسم الله الرحمن الرحيم



# హిజ్రీ సంవత్సరాది

**కాల** చరిత్రలో మరో మైలు రాయికి చేరుకున్నాము. చంద్ర మాసాన్ని బట్టి కాల విభజన జరిగిన హిజ్రీ కేలండర్ ప్రకారం 1430 సంవత్సరాలు పూర్తయినాయి. 1431లో అడుగు పెట్టబోతున్నాము. ఇస్లామీయ కేలండర్‌లో జిల్‌హిజ్జా మాసం చిట్ట చివరిదైతే ముహర్రమ్ మొట్టమొదటిది.

ఇంతకీ హిజ్రీ శకానికి గల ప్రాముఖ్యం ఏమిటి? హిజ్రత్ అంటే అసలు అర్థం ఏమిటి? అన్న ప్రశ్నలు ఈ సందర్భంగా ఉదయించక మానవు. నిఘంటువు ప్రకారం 'హిజ్రత్' అంటే వలస, బదిలీ, ప్రస్థానం, తరలింపు అనే అర్థాలొస్తాయి. ప్రతి మనిషీ కొన్ని ఉద్దేశ్యాల కోసం, కొన్ని లక్ష్యాల సిద్ధి కోసం ఒక చోటి నుండి మరో చోటికి, ఒక దేశం నుంచి మరో దేశానికి వలస పోతాడు. కోరిన దానిని సాధిస్తూ ఉంటాడు. కాని ఇస్లామీయ పరిభాషలో 'హిజ్రత్' అనేది అసాధారణ విషయం. అది మానవతలో ఓ మార్పుకు, ఓ పరివర్తనకు, ఓ విప్లవానికి, ఓ మేలి మలుపుకు, ఓ ఉన్నతాశయ సిద్ధికి ఉద్దేశించినది.

చెడు నుంచి మంచి వైపునకు, చెడు భావాల నుంచి సవ్యమైన భావాల వైపునకు, చెడు వాతావరణం నుంచి శుభప్రదమైన వాతావరణం వైపునకు, చెడు సహచర్యం నుంచి సద్వర్తనుల సహచర్యం వైపునకు, చెడు వ్యవస్థ నుంచి సత్య ప్రధానమైన వ్యవస్థ వైపునకు, రోగగ్రస్తమైన సమాజం నుంచి ఆరోగ్యవంతమైన సత్సమాజం వైపునకు, పీడనాపూరితమైన విష సంస్కృతి నుంచి స్వేచ్ఛావాయువులు వీల్చగల సువ్యవస్థ వైపునకు ప్రస్థానం చేయటమే అసలు హిజ్రత్.

అయితే ఈ 'ప్రస్థానం' అనుకున్నంత తేలిక కాదు. దీని కోసం గుండె దిటవు చేసుకోవలసి ఉంటుంది. ఇల్లూ వాకిలినీ, ఊరివారిని, ఆప్తులను, అనుబంధాలను, ఆత్మీయులను, ఆస్తిపాస్తులను, ప్రాపంచిక ప్రయోజనాలను వదలుకోవలసి ఉంటుంది. వలసపోయిన కొంగ్రొత్త ప్రదేశంలో 'ముహాజిర్'గా నిలదొక్కుకోవటానికి అష్టకష్టాలూ పడవలసి వస్తుంది.గుండెలకయ్యే గాయాలకు నిబ్బరంగా ఓర్చుకోవలసి ఉంటుంది. కాని ఒక విశ్వాసి దృష్టి సర్వదా దీర్ఘకాలిక ప్రయోజనాలపై నిలిచి ఉంటుంది. రానున్న 'మరో ప్రపంచం'లో తీపి ఫలాలను ఆరగించేందుకు అతను ఈ తాత్కాలిక జగతిలోని చేదు గుళికలను సంతోషంగా దిగమ్రింగుతాడు. బాధలను మనస్ఫూర్తిగా భరిస్తాడు.

14 శతాబ్దాల క్రితం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)కు, ఆయన ప్రియ సహచరులకు సరిగ్గా ఇదే పరిస్థితి ఎదురయ్యింది. హిరా కొండపై ఉద్భవించి, సఫా కొండపై ప్రతిధ్వనించిన ఇస్లామనే అనురాగరావాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయటానికి దుష్టశక్తులన్నీ ఏకమయ్యాయి. సత్యామృతాన్ని ఆస్వాదించిన దివ్యాత్ములను దివారాత్రులు పీడించి, వారి బ్రతుకులను దుర్భరం చేశాయి. ఈ పీడన నుంచి విముక్తి పొంది, ప్రాణప్రదంగా ప్రేమించే తమ జీవన సంవిధానాన్ని, సత్యధర్మాన్ని కాపాడుకోవటానికి ఆ ధన్యజీవులు మదీనాగా ప్రఖ్యాతి గాంచిన 'యస్రిబ్' వైపు ప్రస్థానం చేశారు. అటు పిమ్మట ఆశయప్రాప్తికై పది సంవత్సరాల పాటు అవిశ్రాంతంగా పోరాడారు. అసాధారణ త్యాగాలు చేశారు. అనుపమ రీతిలో సహన స్థైర్యాలు చూపారు. రాత్రిళ్ళలో ప్రభువు సన్నిధిలో మోకరిల్లి ఆర్తంగా సహాయాన్ని అర్థిస్తూనే పగటి వేళల్లో దైవ విరోధుల ఎదుట మొక్కవోని సాహసాన్ని ప్రదర్శించారు. పదేండ్లలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చరిత్రను సృష్టించారు. వస్తయీనూ బిస్సబ్రి వస్సలాహ్. ఇన్నల్లాహ మఅస్సాబిరీన్ అన్న దివ్య వచనానికి అక్షరాలా సార్థకతను చేకూర్చారు. కారుణ్య ప్రభువు ఆ మహనీయులతో ప్రసన్నుడవుగాక!

హిజ్రీ సంవత్సరాది శుభ సందర్భంగా మనం హిజ్రత్‌లోని పరమార్థాన్ని మననం చేసుకోవాలి. అలనాడు ప్రవక్త (స) ప్రియ సహచరులు చేసిన ప్రస్థానంలోనూ – నేడు మనం చేస్తున్న ప్రస్థానంలోనూ ఉన్న వ్యత్యాసాన్ని తరచి చూడాలి. ఎందుకంటే అంతర్యంలోని ఉద్దేశాలకనుగుణంగానే ఫలితాలు లభిస్తాయి. మగువను మనువాడే ఉద్దేశంతో ప్రస్థానం చేసినవారికి మగువ మాత్రమే లభిస్తుంది. 'ధన మూల మిదం జగత్' అంటూ హిజ్రత్ చేసిన వారికి ధనధాన్యాలే ప్రాప్తమవుతాయి. పదవుల కోసం ప్రస్థానం చేసినవారికి పదవులే వరిస్తాయి. అవును – ఇన్నమల్ అమాలు బిన్నియ్యాత్ (కర్మలకు మూలాధారాలు సంకల్పాలే). సంకల్ప నిరతిని బట్టీ, సంకల్పశుద్ధిని బట్టి మాత్రమే సదాశయాలు సిద్ధిస్తాయి. ఒకవేళ ధార్మిక లక్ష్యాల ప్రాప్తితోపాటు ప్రాపంచిక ప్రయోజనాలు కూడా లభిస్తే దాన్ని దేవుని తరఫున 'అడ్వాన్సు టోకెన్' గా భావించి గ్రహించాలి. అంతేగాని ప్రాపంచిక ప్రయోజనాలే ప్రధానం కావు. అవి పాక్షికమైనవి, సాపేక్షికమైనవి, సాంద్రమైనవి, అరిగిపోయేవి, నీటిలోని ఉప్పులా కరిగి పోయేవే. కడదాకా కనువిందు చేసేవి, కంటికి చలువ నిచ్చేవీ, కలకాలం నిలిచేవీ, కళకళలాడేవి ధార్మిక ప్రయోజనాలే సుమా!



# ముహర్రమ్

- అబుల్ హసన్

ఎన్ని ముహర్రమ్‌లు రాలేదు ఇం
కెన్ని ఆషూరాలు పోలేదు
ఎక్కడి బ్రతుకులు అక్కడే
ఎక్కడి గొంగళి అక్కడే

ఈ ముహర్రమ్ మహోదయ వేళ
ఈ వసంతం నవోదయ వేళ
విప్లవ శంఖం పూరించుదాం
విజయభేరి మ్రోగించుదాం

విజయం దేనిపైన?
విప్లవం ఎందుకని?
విజయం అవిచ్ఛిన్నంగా సాగుతున్న అవినీతిపై
విప్లవం అసందర్భంగా రేగుతున్న అధర్మాలపై

ఈ ముహర్రమ్ శుభోదయ వేళ
పంచుదాం ప్రేమానురాగాలను
ఈ వసంతం దినోదయ వేళ
పాతేద్దాం ఖురాఫాతులను

**ఆనాడు-**
13 శతాబ్దాల క్రిందట
నిరంకుశత్వాన్ని అడ్డుకోవడానికి
దమన నీతిపై ధ్వజమెత్తడానికి
ప్రతిఘటన సమరం సాగింది

**మరి నేడు-**
13 శతాబ్దాల తర్వాత
గూడు కట్టిన మూఢ విశ్వాసాలు
కొరుకుడు పడని కొంగ్రొత్త పోకడలు
వింత విడ్డూర విశృంఖలత్వాలు
సత్సమాజాన్ని కాటేసే విష వాయువులు

పంజాలకు పూలేస్తారు, పీర్లతో ఊరేగుతారు
గల్లీల్లో గలాటాలు, బస్తీల్లో ఉరుసులు చేస్తారు
మస్తాన్ వలీకి రొట్టెలు విడుస్తారు
గరీబ్ నవాజ్ సమాధి పటం కట్టి పొగుడుతారు
గౌసె ఆజమ్ పేరు వింటేనే భయం పుట్టి వణుకుతారు!

ఇంతకీ ఎవరు?
వీరు ఎవరు?

అధర్మాల పెట్టుబడితో
అంధ విశ్వాసాల రాబడితో
మాయామంత్రాల గారడితో
దురాచారాల పేరడితో
ప్రతిమల్ని మోసుకుంటూ
మోసపుచ్చుతున్న వీరు
మనవాళ్ళే!

ఈ వ్యక్తులెవరూ మన
శత్రువులు కారు
వారిలో పేరుకుపోయిన అజ్ఞానం
ఏళ్ళ తరబడి పెనవేసుకున్న మౌఢ్యం
మార్గ భ్రష్టత్వం - వాటికి
ఆజ్యం పోసే ఆసాములు
ఇవే మన ప్రథమ శత్రువులు
అవే మన అవస్థలన్నింటికీ
కారణభూతాలు

మరీ మరీ ఉద్ఘాటిస్తున్నాను
బిద్‌అతులకి గోరీ కట్టాలని
దర్గాల నుంచి దర్సగాహాల వైపు రావాలని
అసత్యం చితికి చితిలో కాలి భస్మం అవుతుందని
సత్యం గెలిచి విజయఢంకా మ్రోగిస్తుందని

ఎందరడ్డుకున్నా, ఇంకెందరు వద్దన్నా
మార్పు వచ్చి తీరుతుంది. ఎందుకంటే -
కాలం పరిణామ శీలం
దాన్ని ధర్మానికనుగుణంగా మలచుకోవడమే ముఖ్యం
దురాచారాల నోట్లో దూది కుక్కి
మార్గభ్రష్టత్వ ముఖాన మట్టి కొట్టి
పంజాల పాడె శాశ్వతంగా ఎత్తి
దిద్దుబాటుకు శ్రీకారం చుట్టాలి


ఈ దురాచారాల ముళ్ళ
పరికి కంప పొదల నుండి
నైట పడటం ఎలా సాధ్యం?
అందుకొకటే మార్గం
మనమే మన ధర్మాన్ని మననం చేసుకోవాలి
అనవరతం అంతర్మథనం చెందాలి
మధురాతి మధురంగా తీర్చి దిద్దుకోవాలి
ఖుర్‌ఆన్ వచనాల ఒడిలో
హదీసు ప్రవచనాల నీడలో

ఇదే నా ముహర్రమ్ అభిజ్ఞత
ఇదంతా ఓపిగ్గా విన్నందుకు
మీ అందరికీ నా కృతజ్ఞత!

(ప్రముఖ రచయిత సత్య ప్రేమికులు. సత్యామృతాన్ని ఆస్వాదించిన ధన్యులు. పూర్వాశ్రమంలో ఉండవల్లి నరసింహారావుగా పరిచితులు. దరిమిలా క్రైస్తవ మతం గ్రహించి పాస్టర్ యోసేపుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 1990 - 93లో క్రైస్తవ మత శాఖ తెలుగు బాప్టిస్టు సంఘాలలోను, 2002 - 2005 మధ్యకాలంలో మార్టిన్ లూథర్ స్థాపించిన ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ సంఘాలలోనూ పరిచర్యగా ఉన్నారు. ఆ తర్వాత 2005 డిసెంబరులో 'సాక్ష్య వచనం' పలికి ఇస్లాం ధర్మం స్వీకరించారు. ప్రస్తుత నామధేయం అబ్దుర్రజాక్. 40 ఏండ్ల అబ్దుర్రజాక్ గారు విద్యావంతులు. గుంటూరు జిల్లా క్రోసూరు మండలంలోని ఒక గ్రామంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. మంచి రచయిత, కవి కూడా. వీటన్నింటికీతోడు మనసున్న మంచి మనిషి. వినమ్రులు. కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఆయనగారికి సన్మార్గంలో సహనస్థైర్యాలను ప్రసాదించాలని, ఆయన కలము నుండి మరిన్ని గొప్ప రచనలు జాలు వారాలని ప్రార్థన! - ఎడిటర్)

అబ్దుర్రజాక్ (క్రోసూరు)

# హిరా గుహలో నెరవేరిన బైబిల్ ప్రవచనం



ఈసా మసీహా (ఏసు క్రీస్తు) (అ) ప్రభవించడానికి పూర్వం సుమారు 740 వ సంవత్సరం నుండి 701 వ సంవత్సరం వరకు రమారమి 39 ఏండ్లపాటు అల్లాహ్ తన దాసుడు మరియు ప్రవక్తయైన యెషయా (అ) ద్వారా పలికిన వాక్కు "నీవు దీనిని చదువుమని చెప్పి అక్షరములు తెలియనివానికి దానిని అప్పగించును. అతడు - అక్షరములు నాకు తెలియవనును. బైబిల్‌గా పిలువబడుచున్న గ్రంథములో పాత నిబంధనల గ్రంథమున గల యెషయా 29వ అధ్యాయము: 12వ వచనం).

మహోన్నతుడు, మహిమాన్వితుడు, కేవలం తన సత్యము చేతనే సర్వ సృష్టిని సృష్టించిన సృష్టికర్తయైన అల్లాహ్‌కే సకల ప్రశంసలు, పొగడ్తలు శోభిస్తాయి. ఆయన తన దాసుని ద్వారా పలికిన వాక్కును సుమారు 1300 ఏండ్ల తర్వాత ఒక శుభప్రదమైన రమజాను మాసంలో శుక్రవారము (క్రీ.శ. 12 రోజు ఫిబ్రవరి నెల 610వ సంవత్సరము) నాడు తన దూతయైన జిబ్రయీల్ (గాబ్రియేల్) (అ) ద్వారా హిరా గుహలో నెరవేర్చిన అద్భుతశాలి, మహా వివేకి, సర్వ జ్ఞాన సంపన్నుడైన అల్లాహ్ తన దాసుడు మరియు ప్రవక్త, విశ్వ కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) యెడల జరిగించిన మహిమ, వహీ అవతరణను గూర్చి అవగాహన గలవారందరికీ సువిదితమే.

మనిషికి తాను ఎరుగని జ్ఞానాన్ని కలం ద్వారా నేర్పిన ఎంతో ఉదారుడు, సర్వ సృష్టికి ప్రభువైన అల్లాహ్ వాక్కు: **"కీడుచే యత్నించుచూ గుమ్మములో తమ్మును గద్దించువానిని పట్టుకోవలెనని ఉరినొడ్డుచు, మాయ మాటల చేత నీతిమంతుని పడద్రోయు వారు నరకబడుదురు. (యెషయా-29:21)**

అంతిమ దైవప్రవక్త (స)కి – నాటి అరబ్ సమాజానికి ఏదైనా వ్యాజ్యము ఉన్నది అంటే మనో కాంక్షల దాస్యం, తమ పూర్వీకుల ఆచారాల దాస్యం, అల్లాహ్‌ని తప్ప ఇతరుల దాస్యం అనే షిర్క్‌లో కూరుకుపోయిన వారిని 'తౌహీద్' వైపునకు ఆహ్వానించడమేగా!

విగ్రహారాధనలో నిండా మునిగిపోయిన 'వారులు' దానిని విడచి ఏక దైవం వైపుకి రమ్మని పిలుపునిస్తున్న ప్రవక్త (స)ను ప్రతివాదిగా భావించి, మట్టుపెట్టు (సంహరించు)టు ద్వారా కీడు చేయాలనే వారి ప్రయత్నం నెరవేరలేదు. తమ మనో కాంక్షలు, తమ పూర్వీకుల ఆచారాల పాటింపు విషయంలో తమను గద్దించుచున్న ప్రవక్త (స) ను ఏలాగైనా దేవుని గుమ్మము కాబా మస్జిదులో పట్టుకోవలెనని కుట్ర పన్నిన సంగతి, వారి కోసం నరక దూతలను పిలిచే విషయం దేవుడు బయల్పరచాడు. ఈ సంఘటన తర్వాత **"చంచల బుద్ధిగలవారు వివేకులవుదురు. సణుగు వారు ఉపదేశమునకు లోబడుదురు"**

(యెషయా- 29: 24)

అను ప్రవచన నెరవేర్పుగా జరిగిన వృత్తాంతములను పరిశీలించినచో నాటి అరబ్ సమాజము ప్రవక్త (స) బోధనల ద్వారా వివేకులైనవారుగా, దేవుని ఉపదేశములకు లోబడినట్లుగా గమనించ గలము.

ఒకే దేవుడు, ఒకే వహీ - వివిధ జాతులు - వివిధ కాలాలు, వివిధ ప్రవక్తలు ఆదం (అ) మొదలుకొని ముహమ్మద్ (స) వరకు తెచ్చిన సందేశ సారాంశము ఒక్కటే; అదే 'తౌహీద్'. అందువలన భవిష్యత్ కాలములో ఉద్భవింపజేయబోవు ప్రవక్తలను గురించి ముందుగానే ప్రకటించటం దేవుడు ఎన్నుకొన్న విధానం. కనుక అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) గురించి అల్లాహ్ ప్రకటించిన లక్షణాలను పరిశీలించండి.

1) ఇదిగో నేను ఆదుకొను నా సేవకుడు.
2) అతని యందు నా ఆత్మను ఉంచి యున్నాను.
3) అతడు అన్యజనులకు న్యాయము కనబరుచును.
4) అతడు కేకలు వేయడు, అరువడు. తన కంఠ స్వరమును వీధిలో వినబడనియ్యడు.
5) నలిగిన రెల్లును అతడు విరువడు.
6) మకమకలాడుచున్న జనుపనార వత్తిని ఆర్పడు.
7) అతను సత్యమునననుసరించి న్యాయమును కనబరుచును.
8) భూలోకమున న్యాయము స్థాపించువరకు అతడు మందగిలడు, నలుగుడు పడడు.

9) ద్వీపములు అతని బోధ కొరకు కనిపెట్టును.
"ఆకాశములను సృజించి, వాటిని విశాలపరచి, భూమిని అందులో పుట్టిన సమస్తమును పరచి దాని మీదనున్న జనములకు ప్రాణమును, దానిలో నడుచువారికి జీవాత్మను ఇచ్చుచున్న దేవుడైన అల్లాహ్ ఈలాగు సెలవిచ్చుచున్నాడు"-
10) గ్రుడ్డివారి కన్నులు తెరుచుటకు,
11) బంధింపబడిన వారిని చెరసాలలో నుండి వెలుపలికి తెచ్చుటకు, చీకటిలో నివసించువారిని బందీ గృహములో నుండి వెలుపలికి తెచ్చుటకు అల్లాహ్‌నైన నేనే -
12) నీతి విషయములో నిన్ను పిలిచి, నీ చేయి పట్టుకొనియున్నాను.
13) నిన్ను కాపాడి ప్రజల కొరకు నిబంధనగాను,
14) అన్య జనులకు వెలుగుగాను నియమించియున్నాను.
(యెషయా-42: 1-7)

**అంశముల వారీగా వివరణ:**

1) అల్లాహ్‌చే ఏర్పరచబడినవాడు ఆయనకు ఇష్టమైన ప్రవక్త ముహమ్మద్ (ﷺ) పుట్టిన రోజు ఏనుగుల సంవత్సరం రబీవుల్ అవ్వల్ 12వ తేది (క్రీ.శ. 29-08-570) మొదలుకొని వారు మరణించిన రోజు హిజ్రీ శకం 11వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ మాసం 12వ తేది సోమవారం వరకు (ఈ భూలోక జీవిత పర్యంతము) అల్లాహ్ ప్రవక్త (ﷺ)ను ఆదుకొన్నట్లు, తమ కన్నులారా చూసిన సహాబీలు వారి అనుచరులు, నాటి సమాజం, వారి (ﷺ) జీవిత చరిత్రను చదివిన ప్రతి ఒక్కరు తెలిసికొనగలరు.

2) వహీ అవతరణ ద్వారా అల్లాహ్ తన ఆత్మను తన దాసునిలో ఉంచాడు.

3) 5 మూల సూత్రములతో కూడిన ఇస్లాం ద్వారా తౌహీద్ వైపునకు వచ్చే అన్యజనులు (ప్రవక్త (ﷺ) ప్రభవించిన జాతి కానివారు) సహితం స్వర్గ సాఫల్యం పొందవచ్చునను న్యాయమును కనపరచారు.

4) నేటి మత బోధకులవలె దైవ విషయాలను బోధించడంలోగానీ, వివరించడంలోగానీ, తెలియజెప్పడంలోగాని ప్రవక్త (ﷺ) కేకలు వేయలేదు, అరవ లేదు, తన కంఠ స్వరమును పెంచలేదు. ఖుర్‌ఆన్ ఆయతుల పారాయణంలో శ్రావ్యంగా, మధురంగా, ప్రవచనాలు చెప్పుటలో సున్నితంగా వ్యవహరించేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే మాటలకే పరిమితము కాక ప్రతి దానినీ క్రియాత్మకంగా ఆచరించి చూపేవారు.

5) నలిగిన రెల్లు: సర్వ సృష్టికర్తయైన అల్లాహ్‌ను విడచిపెట్టి, తమ కొరకు ఒక్కొక్క అంశమునకు ఒక్కొక్క దేవుడను/దేవతను సృష్టించుకొన్న నూహ్ (عليه السلام) కుమారుడు షేము సంతతివారు నివసించుచున్న మధ్యధరా సముద్రము నుండి నైలు నదీ తీరమున దక్షిణముగా 600 మైళ్ళ వరకు వ్యాపించి, నేడు ఈజిప్టుగా పిలువ బడుచున్న ఐగుప్తు దేశము (నైలు నదిలో రెల్లు గడ్డి బాగా పెరుగుట వలన అలా పిలుచుట జరిగినది). ఈ దేశ ప్రజలు - పాలకులు నిజ దేవుని విడిచి తమ కొరకు మిథ్యా దైవాలను పూజించుచూ, తమ మృతుల కళేబరములను అత్యంత అభిమానంతో, శ్రద్ధతో, భద్రపరచుచూ, వారి కొరకు ప్రత్యేక దినములను ఏర్పరచి విందులు, వినోదముల ద్వారా బహుదైవారాధనలో మునిగిపోయిన వారి కోసం 'తౌహీద్' వైపు ఆహ్వానించు మూసా (عليه السلام)ను లక్ష్యపెట్టక తమ నాశనమును, స్వయంగా తామే కొనితెచ్చుకొన్న ఆ జాతి ప్రజలు 'నలిగిన రెల్లు' వలె అయిపోయారు. అలాంటి స్థితిలో ప్రవక్త (ﷺ) వారిని మరింత విరువక నిజ దేవుని వైపుకు ఆహ్వానిస్తారనేది ఈ వచన సారాంశము. మూసా (عليه السلام) సోదర జనాంగము నుండి ప్రభవించిన ప్రవక్త (ﷺ) నలిగిన రెల్లుగానున్న ఐగుప్తు జనులకు ఏ మాత్రం హాని కలిగించరని కూడా దీని భావం.

అల్లాహ్ యెడల భయము ప్రవక్త (ﷺ)కి ఇంపైన సువాసన. అందుకే వారు (ﷺ) నిద్ర సహితం మానుకొని, కాళ్ళు వాచిపోయేలా 'తహజ్జుద్' నమాజు ఆచరించేవారు. కంటి చూపును బట్టి, అనగా ఈ లోక పోకడ దృష్ట్యా తీర్పు తీర్చక పై (దేవుని వద్ద) నుండి దైవ దూత జిబ్రయీల్ (عليه السلام) ద్వారా విను దానిని బట్టి వ్యాజ్యములను విమర్శ చేసేవారు, తీర్పునిచ్చేవారు. కేవలం దేవుని నీతిని బట్టి మాత్రమే బీదలకు తీర్పు తీర్చేవారు. కాని తద్విరుద్ధంగా ఎంత గొప్పవారి సిఫారసును కూడా వినేవారు కాదు. భూలోకమున దీనుల పక్షమున యథార్థముగా తీర్పు తీర్చేవారు. తన వాగ్దండము చేత - అనగా ప్రవచనములచే లోకమును దేవునికి లోబర్చారు. తన పెదవుల ఊపిరి చేత - ఖుర్‌ఆన్ ఆయతుల పారాయణం ద్వారా దుర్మార్గులకు వారి దుష్కృత్యమును జ్ఞాపకము చేసి ఈ లోక కార్యకలాపాల విషయమై (చచ్చినవారి వలె) పశ్చాత్తాప పడేలా చేసేవారు. కేవలం సర్వ సృష్టికర్త అయినా అల్లాహ్‌నే ఆరాధించాలనే నీతి మరియు ఆయన (ﷺ) చూపిన మార్గం ద్వారానే (సత్య మార్గం) స్వర్గ సాఫల్యం పొంద గలరనే విషయాలతో ధర్మ సంస్థాపన కోసం ధర్మ పథంలో కత్తి దాలు పట్టి యుద్ధం చేస్తారనే ప్రవచనాలు నెరవేరాయి.

**6) మకమకలాడుచున్న జనుపనార వత్తిని ఆర్పకపోవడం:**

భూలోకంలో దైవ ధర్మాన్ని స్థాపించి, దైవ దాస్యం ద్వారా ఆ ధర్మాన్ని భూలోకంలో వ్యాపింపజేయుటకు ప్రత్యేకంగా ఏర్పరచుకొన్న ఇస్రాయీల్ సంతతి (బనీ ఇస్రాయీల్) వారు ఆధ్యాత్మికంగానూ, ఈ లోక పరంగానూ దేవుని యొద్దనుండి అనేక మేళ్ళు పొందియుండి, ఆ మేళ్ళతో కూడిన సుఖభోగాల ప్రపంచ వ్యామోహంలో పడి ధర్మ భ్రష్టులయ్యారు. వారికి సన్మార్గము చూపుటకు దేవుడు తన వాక్కులతో వివిధ కాలాలలో వివిధ ప్రవక్తలను ప్రభవింపజేయటం జరిగినది. అయితే వారు ప్రవక్తలను నిర్లక్ష్యము చేయుట ద్వారా దైవ ధిక్కారానికి పాల్పడ్డారు. ఆ ధిక్కార లక్షణమే ప్రవక్తలను వేధించి, వేధించి, హింసించుట మాత్రమే గాక ఈసా (عليه السلام) విషయంలో చంపామనే భ్రమకు గురయ్యేవరకూ దారి తీసింది. అప్పటి వరకు ఆధ్యాత్మ జగత్తులో సాటిలేని మేటి రారాజులుగా వెలుగొందినవారు దైవ ప్రవక్త ఈసా (عليه السلام) విషయంలో ప్రవక్తగా అంగీకరించక తిరుగుబాటు చేసి సున్నతి లేని జనాంగమైన రోమా పాలకుల వద్దకు వ్యాజ్యమును తెచ్చుట వలన తమ స్థాయిని దిగజార్చుకొనిరి.

"దేవుని గూర్చిన బోధనొందుడుము అని తమ పొరుగువారికిగానీ, తమ సహోదరులకుగానీ (దేవుడు తమ మనస్సులలో, హృదయముల మీద వ్రాసిన ధర్మ విధిని) ఉపదేశింపవలెనను నియమమును ఉల్లంఘించి తన సన్నిధిన ఉండకుండ పోయిన బనీ ఇస్రాయీల్ మరి ఎన్నటికి దేవుని జనముగా ఉండక పోవుదురు". (యిర్మియా-31: 34-36)

ఈసా (عليه السلام) బనీ ఇస్రాయీల్‌లో వారి కొరకు ఆ కాలంలో ప్రభవించిన దైవప్రవక్త. ప్రవక్తగా అంగీకరించక, అభ్యంతరపడి తిరస్కరించుట వలన "కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్ద నుండి తొలగింపబడి దాని ఫలమిచ్చు జనులకు ఇయ్యబడునని మీతో చెప్పుచున్నాను". (మత్తయి-21: 43)
ఈసా (عليه السلام) ప్రవచనం నెరవేరులాగున, ఈ లోకంలోనూ, పరలోకంలోనూ ఉభయ భ్రష్టులై, దైవ వాక్కు అనే నూనెలేక ఆరిపోయే ముందు దీపం టపటప కొట్టుకొనుచున్నట్లుగా, మకమకలాడుచూ, ఆరిపోయే స్థితిలోనున్న బనీ ఇస్రాయీల్‌ను ముహమ్మద్ (ﷺ) పూర్తిగా ఆర్పక వారికి తిరిగి దేవుని వైపునకు ఏ మాత్రం హెచ్చుతగ్గులు, తేడాలు చూపక తన సదాచరణలు, సత్క్రియల ద్వారా వారి ధర్మ శాస్త్రానికి (తౌరాత్‌కి) అనుగుణంగా ఇస్లాంలోనికి (శాంతి మార్గంలోనికి) ఆహ్వానించారు. అయితే ధర్మం విషయంలో బలవంతము లేదు గనుక, వారిలో విశ్వసించిన బహు కొద్దిమంది ముస్లింలయ్యారు. మిగిలినవారు తమ సొంత లక్షణములు (దుర్మార్గము) నెంచుకొని జీవించుచున్నారు.

7) ప్రవక్త (ﷺ) దైవం వద్ద నుండి వచ్చిన సత్యమునకనుసరించి, న్యాయమును కనబరిచెను. ఉదా: దొంగిలించిన కారణముగా ఒక గొప్పింటి స్త్రీ (ఎన్ని సిఫారసులు వచ్చినను లక్ష్య పెట్టక) చేతులను నరికే శిక్ష అమలు చేసిన సంఘటన.
8) భూలోకమున దైవ న్యాయము (దైవ దాస్యం ద్వారా తౌహీద్)ను స్థాపించువరకు ప్రవక్త (ﷺ) మందగిల్లలేదు, నలుగుడు పడలేదు.
9) భూమార్గమున సంబంధమున్న దేశములు అందు నివసించుచున్న జాతులలోనే కాదు, ఏ మాత్రము భూమార్గము ద్వారా సంబంధంలేని, చుట్టూ ఆవరించియున్న జలముల మధ్యనున్న ద్వీపములు, అందలి ప్రజలు ఆయన (ﷺ) బోధ స్వీకరించి 'ఇస్లాం'ను ఆచరిస్తున్న విషయము చారిత్రక, భౌగోళిక సత్యము.
10) నాటి సమాజము విగ్రహారాధన జరిపించుట ద్వారా సృష్టికర్తను గుర్తించలేని గ్రుడ్డితనములోనున్నప్పుడు, వారి కన్నులను తెరిపించి, ఏక దైవారాధన వైపునకు పిలిచారు.
11) మద్యపాన సేవనము, వ్యభిచారము జూదము మొదలైన పాప క్రియల ద్వారా ఇబ్లీసు రాజ్యంలో బంధింపబడిన చెరసాలలో నుండి, ఆ పాప క్రియల నుండి వారిని, తన దైవ వాక్కులతో దూర పరచుట ద్వారా ఆ చీకటి సామ్రాజ్యము నుండి దేవుని వెలుగు (జ్ఞానము) వైపునకు తీసికొని వచ్చారు.
12) బురదలో కూరుకుపోయిన వ్యక్తి మరొకరి బురదను కడుగజాలడు. అలాగే చీకటిలోనున్న వ్యక్తిని వెలుగు వైపునకు నడిపించేవాడు తప్పక వెలుగులో ఉండాలి. పుట్టుక నుండి నీతిగా మెలిగిన ప్రవక్త (ﷺ)ను, ప్రజలను దేవుని వైపునకు ఆహ్వానించే వానిగా దేవుడు ఎన్నుకున్నాడు.
13) ప్రవక్త (ﷺ)ను అనేక ఈతి బాధల నుండి అల్లాహ్ కాపాడి, ఆయన జాతి ప్రజలకు ఒక నిబంధనగా నియమించారు. అంటే ప్రవక్త (ﷺ)ను విశ్వసించి ఆయన చూపిన మార్గం ద్వారా సృష్టికర్తను ఆరాధించి స్వర్గ సాఫల్యం పొందడం - ఈ నిబంధనను పాటించడం అవుతుంది. అలా కాక ప్రవక్త (ﷺ)ను విశ్వసించక - ఆయన (ﷺ) మార్గం అనుసరించక నరక శిక్షకు గురికావడం - నిబంధనను అతిక్రమించడం. సూక్ష్మంగా చెప్పాలంటే దేవునికి - ప్రజలకు మధ్య నిబంధన ప్రవక్త (ﷺ).
14) ప్రవక్త (ﷺ)ను విశ్వసించి ఆయన (ﷺ) చూపిన మార్గము ద్వారా తౌహీద్ పాటించినట్లయితే, అరబ్బేతరులు సహితం అనగా విశ్వసించిన మానవులందరూ స్వర్గ సాఫల్యం పొందవచ్చుననే సమ న్యాయం కోసం వెలుగుగా నియమించబడ్డారు.
"యెష్షయి మొద్దు నుండి చిగురు పుట్టును. దాని వేరుల నుండి అంకురము ఎదిగి ఫలించును. యెహోవా ఆత్మజ్ఞాన వివేకములకు ఆధారమగు ఆత్మ ఆలోచన బలములకు ఆధారమగు ఆత్మ తెలివిని, యెహోవా యెడల భయభక్తులను పుట్టించు ఆత్మ అతని మీద నివసించును. యెహోవా భయము అతని కింపైన సువాసనగా ఉండును. కంటి చూపును బట్టి అతడు తీర్పు తీర్చడు. తాను వినుదానిని బట్టి విమర్శ చేయడు. నీతిని బట్టి బీదలకు తీర్పు తీర్చును. భూవాసులలో దీనులైన వారికి యదార్థముగా విమర్శ చేయును. తన వాగ్దండము చేత లోకమును కొట్టును. తన పెదవుల ఊపిరి చేత దుష్టులను చంపును. అతని నడుమునకు నీతియు అతని తుంట్లకు సత్యమును నడికట్టుగా ఉండును. (యెషయా-11: 1-5)

## పాఠకులారా! పరిశీలించండి!!

దావూద్ (عليه السلام) తండ్రి పేరు యెష్షయి ఈయన ఇబ్రాహీమ్ (عليه السلام) సంతతికి చెందినవారు. వీరి సంతతి ఓ పెద్ద మహా వృక్షం. దైవ దౌత్యం బనీ ఇస్రాయీల్ జాతిలో ఈసా (عليه السلام)తో ముగియుట వలన, కొమ్మలు నరకబడి మొద్దు మాత్రం మిగిలింది. ఆ మొద్దుకి గల వేర్లలో ఒక బలిష్ఠమైన వేరు జ్యేష్ఠ కుమారుడైన ఇస్మాయీల్ (عليه السلام). వారి అంకురము ముహమ్మద్ (ﷺ) ఎదిగి దైవ దౌత్యంలో ఫలించారు. అల్లాహ్ యెడల భయము ప్రవక్త (ﷺ)కి ఇంపైన సువాసన. అందుకే వారు (ﷺ) నిద్ర సహితం మానుకొని, కాళ్ళు వాచిపోయేలా 'తహజ్జుద్' నమాజు ఆచరించేవారు. కంటి చూపును బట్టి, అనగా ఈ లోక పోకడ దృష్ట్యా తీర్పు తీర్చక పై (దేవుని వద్ద) నుండి దైవదూత జిబ్రయీల్ (عليه السلام) ద్వారా విను దానిని బట్టి వ్యాజ్యములను విమర్శ చేసేవారు, తీర్పునిచ్చేవారు. కేవలం దేవుని నీతిని బట్టి మాత్రమే బీదలకు తీర్పు తీర్చేవారు. కాని తద్విరుద్ధంగా ఎంత గొప్పవారి సిఫారసును కూడా వినేవారు కారు. భూలోకమున దీనుల పక్షమున యదార్థముగా తీర్పు తీర్చేవారు. తన వాగ్దండము చేత - అనగా ప్రవచనములచే లోకమును దేవునికి లోబర్చారు. తన పెదవుల ఊపిరి చేత - ఖుర్ఆన్ ఆయతుల పారాయణం ద్వారా దుర్మార్గులకు వారి దుష్టత్వమును జ్ఞాపకము చేసి ఈ లోక కార్య కలాపాల విషయమై (చచ్చినవారి వలే) పశ్చాత్తాప పడేలా చేసేవారు. కేవలం సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌నే ఆరాధించాలనే నీతి మరియు ఆయన (ﷺ) చూపిన మార్గం ద్వారానే (సత్య మార్గం) స్వర్గ సాఫల్యం పొందగలరనే విషయాలతో ధర్మ సంస్థాపన కోసం ధర్మ పథంలో కత్తి దాలు వల్లే యుద్ధం చేస్తారనే ప్రవచనాలు నెరవేరాయి.




# ఏరికోరి IPC పంపిన హజ్జ్ పయన బృందం

IPC ఆధ్వర్యంలో ఈ ఏడాది 40 మంది న్యూ ముస్లిం సోదరులు 17-11- 09 వ తేదీన హజ్జ్ యాత్రకు బయలుదేరారు. వివిధ భాషా వర్గాలకు, విభిన్న దేశాలకు చెందిన వీరిలో 14 మంది తెలుగు సోదరులు ఉన్నారు. ఇన్షాఅల్లాహ్ వీరంతా హజ్జ్ యాత్ర ముగించుకుని డిశంబర్ మొదటి వారంలో తిరిగి వస్తారు. కారుణ్య ప్రభువైన అల్లాహ్ తన అతిథులైన హాజీలందరి సాధనను ఆమోదించాలని, సురక్షితంగా వారిని వారి గమ్యస్థానాలకు చేర్చాలని మనమందరం వేడుకుందాం.



బుద్ధ భగవానుని అవతారంగా రూపొందిన నేను 45 సంవత్సరాలపాటు సుఖ భోగాలలో జీవితం గడిపాను. ప్రజలు నాకు సాష్టాంగపడేవారు. అలాగే వారు 'నేను దేవుడిని' అని నమ్మేవారు. అలాగే నేను కూడా నమ్మాను. నా జీవితంలోని 45 సంవత్సరాల సుదీర్ఘ కాలాన్ని దైవత్వపు ముసుగు ధరించి బుద్ధ భగవానుని అవతారంగా, బుద్ధుడు 7 పర్యాయాలు తిరిగి జన్మించాడని, నేనూ వారిలోని ఒకడిగా ప్రకటించుకొని గడిపాను. 'నేను ఏదైతే పలుకుతానో అది దేవుని వాక్కు' అని ప్రకటించి ఉన్నాను. ఆ విషయం పట్ల నాకు విశ్వాసం కూడా ఉండేది. నేనే కాకుండా పసుపు పచ్చని దుస్తులు ధరించిన బౌద్ధ భిక్షువులందరూ అదే విధంగా విశ్వసించే వారు.

ప్రపంచంలోకెల్లా బౌద్ధమతం సర్వోత్కృష్ట మైనదని నేను విశ్వసించేవాడిని. ఆ విశ్వాసంతోనే నేను ప్రపంచంలోని వివిధ దేశాలలో దానిని ప్రచారం చేశాను. తత్ఫలితంగా వందలాది దేశాల్లో నాకు శిష్యులు, సహాయకులు రూపొందారు.

భావన చెలరేగింది. తత్ఫలితంగా దైవత్వపు ముసుగులో జీవితం గడుపుతున్న 'నేను' క్రమక్రమంగా ఒక మానవుని రూపంలోకి మారిపోయాను. బ్రహ్మచారి జీవితం గడుపుతూ ఉండిన నేను ఒక భర్తగా మారాను. ఒంటరిగా ఒకే శరీరాన్ని కలిగిన నేను ఒక తండ్రిగా మారాను. ఇతరులకు శ్రేయస్కర మార్గాన్ని చూపుతూ ఉండిన నేను స్వయంగా శ్రేయస్కర మార్గాన్ని అన్వేషించే వాడిగా మారాను. బౌద్ధ సన్యాసులను, జంతువులను దైవాలుగా విశ్వసించే నేను ఒక్కడైన అల్లాహ్‌ను నిజమైన ఆరాధ్యునిగా, దేవునిగా అంగీకరించి విశ్వసించాను.

క్లుప్తంగా చెప్పాలంటే నేను పూర్వం దేవుడిగా ఉండేవాడిని. (ఆ విధంగా నేనూ భావించేవాడిని, ప్రజలూ విశ్వసించేవారు). నేను మానవుడిగా మారిపోయాను. ప్రారంభం నుంచి చివరివరకు నా జీవితానికి సంబంధించిన పరిస్థితులను క్లుప్తంగా మీ ముందు పొందుపరుస్తాను.

**బుద్ధం శరణం గచ్ఛామి**
**ధర్మం శరణం గచ్ఛామి**
**సంఘం శరణం గచ్ఛామి**

లో పలు బౌద్ధ విహారాలలో సుఖవంతమైన జీవితం గడిపే మేము ఆర్య వర్ణ వ్యవస్థ (కుల వ్యవస్థ)కు వ్యతిరేకంగా కరవాలమెత్తి బయలుదేరినవారము.

### మానవుడెవరు?

మానవుడు స్వయంగా జన్మించాడా? లేక ఏ దేవుడయినా అతడిని పుట్టించాడా? మరణం ఎందుకు సంభవిస్తుంది? మరణించిన తర్వాత మానవుడేమవుతాడు?

నా అంతరాత్మ నన్ను ఇటువంటి పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఉండేది. నా మనో మస్తిష్కాలలో ఇటువంటి ప్రశ్నల తుఫాను చెలరేగేది. పోగొట్టుకునే వస్తువును వెతుక్కునే వ్యక్తి వలె వాటికి సమాధానాలను అన్వేషించసాగాను. తత్కారణంగా నాలో క్రమక్రమంగా మనో వాంఛల పట్ల విహ్వల భావం జనించసాగింది. నేను సత్యాన్వేషణలో నిమగ్నుడయ్యాను. తత్కారణంగా నా హృదయంలో ఒక కాంతి కిరణం ప్రసరించింది. డబ్బు వెచ్చించడం వల్ల లభ్యం కాజాలని ప్రేమ, కారుణ్యం, అణుకువలు నా హృదయంలో జనించాయి. నేను పయనిస్తున్న మార్గం సరైనదో కాదో



రచన
ముహమ్మద్ ముహిబ్బుల్లాహ్

అనువాదం
అఫ్రోజ్ అహ్మద్

# మనిషిగా మారిన ఒక దేవుడు -1

నా స్వంత సోదరుడు నేటికీ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధుడైన బౌద్ధ సన్యాసి. అతడు అమెరికాలోని లాస్ ఏంజిలెస్ నగరంలో ఉంటాడు. నేను దైవత్వపు వేషంలో కొనసాగుతూ ఉండిన కాలంలో ఒక ముస్లిం సోదరుడు, చెన్నయ్‌లో నివసించే నా శిష్యుడైన డాక్టర్ దయ్యప్పన్ అనే బౌద్ధ మతానుయాయి ద్వారా నాకు ఇస్లాం ధర్మంతో పరిచయం కలిగింది. అలాగే నాకు ఇస్లాంకు చెందిన కొన్ని పుస్తకాలు లభ్యమయ్యాయి. కానీ నేను వాటిని నిర్లక్ష్య ధోరణితో అధ్యయనం చేశాను. అయితే ఆ తర్వాత ఖుర్‌ఆన్, దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (ﷺ) జీవిత చరిత్రల అధ్యయనాన్ని నిరంతరాయంగా కొనసాగించాను. ఆ సమయంలో నా హృదయాంతరాలలో నా పాపాల పట్ల పశ్చాత్తాప

ఈ సూత్రాలకు అనుగుణంగా జీవితం గడుపుతూ ఉండిన నా నోటి నుంచి ఈ పలుకులు, నినాదాలు వెలువడుతూ ఉండేవి. నేను బోధి వృక్షం క్రింద కూర్చుని జ్ఞానాన్ని ఆర్జించాను. బౌద్ధ సన్యాసి నయ్యాను. ప్రపంచంలో బౌద్ధ మత ప్రచారకునిగా కొనసాగాను.

### గౌతమ బుద్ధుడు:

మానవుడిని మానవుడి దాస్యం నుంచి వెలికి తీసిన, అజ్ఞానాన్ని అంతమొందించిన, ఆర్య జాతి హింసాదౌర్జన్యాలను తుద ముట్టించిన, మానవునికి శాంతి శ్రేయాల మార్గాన్ని చూపిన వ్యక్తి గౌతమ బుద్ధుడు.

### బ్రహ్మచారులు:

బౌద్ధ విశ్వాసాన్ని భువిలో ప్రచారం చేసే మేము, లౌకిక వాంఛలను కలిగి ఉండని బ్రహ్మచారులమైన మేము, రాజ దర్బారుల

తెలుసుకోవాలనే తపన నాలో జనించింది. అదే విధంగా ఇతర మతాలను పరికించే కోరిక కూడా నాలో జనించింది. నడి వయస్సులో నాలో జనించిన చింతన నా పూర్వపు జీవితాన్ని స్వయంగా సమీక్షించు కునేందుకై అత్యుత్తమ అవకాశాన్ని ప్రసాదించింది. యాదవ కులంలో పుట్టిన నేను 'స్వామీ ఆనంద్ జీ' గా ప్రసిద్ధు డయ్యాను. పట్టు పీఠం మీద కూర్చుండబెట్టి దర్బారు సేవకులు నన్ను ఒక చోటి నుంచి మరొక చోటికి తీసుకెళ్తూ ఉండేవారు. ఇదీ నా పూర్వ స్థితి.

నా పూర్వీకులు తమిళనాడు రాష్ట్రంలో రామనాథపురం జిల్లాలో పరమకుడికి సమీపంలో అలకన్ కులమ్ గ్రామంలో స్థిర పడ్డారు. ఆ తర్వాత సిద్దార్ కొట్టాయ్ ఓడ రేవు నుండి వారు ఓడలో బర్మాకు పయన



మయ్యారు. బర్మాలో నా తాతగారు తన కుటుంబంతో సహా సుఖవంతమైన జీవితం గడుపుతూ ఉండేవారు.

నేను యాదవ కులంలో పుట్టాను. నా పూర్వీకులు పశువుల కాపరులుగా జీవనం కొనసాగించేవారు. కానీ నేను ఈ రోజు బౌద్ధ గురువయిన స్వామి ఆనందుడిగా పిలువబడుతున్నాను. ఆర్థికాభివృద్ధికై నా వంశస్థులు బర్మాకు వలస పోయారు. అయితే వారు తమిళ భాషను మాతృ భాషగా గుర్తుంచుకున్నారు.

నా తండ్రి బాల్యం నుంచే నిబద్ధుడైన బౌద్ధుడిగా ఉండేవారు. అందుకే నన్ను కూడా ఆయన బౌద్ధ మతానుసారం పోషించారు. పలు బౌద్ధ మందిరాలలో నా విద్యాభ్యాసం కొనసాగింది. నన్ను ఒక బౌద్ధ భిక్షువుగా రూపొందించాలని నా తండ్రి ఎంతగానో కోరుకునేవారు. అందుకే ఆయన నాకు తత్సంబంధిత విద్యలన్నింటినీ నేర్పారు. రంగూన్, టిబెట్, చైనా , గోర్సా, కంబోడియా, జపాన్ తదితర దేశాలలోని గురువుల వద్ద నేను విద్యనభ్యసించాను. 19 సంవత్సరాల వయసుకు చేరుకునేలోగా నేను సంపూర్ణంగా విద్యలనభ్యసించాను. బర్మాకు చెందిన రెండవ రాజధాని అయిన మండలాలో బౌద్ధ మత గురువైన చానీపరా ఆసియా ఖండంలోని ఐదుగురు మహా బౌద్ధ గురువులలో ఒకడిగా నన్ను గుర్తిస్తూ ఆమోదించారు. అలాగే నాకు పసుపు పచ్చని వస్త్రాలు కూడా తొడగబడ్డాయి. ఆ విధంగా బౌద్ధ భిక్షువులలో నాకు మహోన్నత స్థాయి ప్రాప్తమయింది. నన్ను జపాన్‌లోని టోక్యో నగరానికి చెందిన 'బోధి దాసోవాసో' అనే పేరు గల బౌద్ధ మత గురువు నాగసాకి నగరంలో నన్ను నియమించారు. అలాగే ప్రపంచమంతటా బౌద్ధ మతాన్ని ప్రచారం చేసి వ్యాపింపజేయడానికి సంబంధించిన మహా బాధ్యత నాపై మోపబడింది. అలాగే 101 గురువులకు అధ్యక్షత వహించే అవకాశం నాకు లభించింది. ఆ తర్వాత నేను ప్రపంచమంతటా పర్యటిస్తూ బౌద్ధ మతాన్ని ప్రచారం చేయనారంభించాను. బౌద్ధులు ఉండే నైరుతి ఆసియాలోని 17 దేశాలలోనే కాకుండా యూరప్‌లోనూ బౌద్ధ మతాన్ని ప్రచారం చేయసాగాను.

బౌద్ధ మత ప్రపంచంలో నాకు సర్వోన్నత స్థాయి ప్రాప్తమయింది. ప్రపంచమంతటా పర్యటించేందుకై నాకు ప్రభుత్వం తరఫున గ్రీన్ కార్డులు లభ్యమయ్యాయి. వాటి ద్వారా నేను అరబ్ దేశాలు తప్ప ప్రపంచ మంతటా పర్యటిస్తూ బౌద్ధ మతాన్ని ప్రచారం చేయసాగాను.

నా సొంత సోదరుడైన స్వామి నందాచార్య నేటికీ అమెరికాలోని లాస్ ఏంజిలిస్ నగరంలో 67 అంతస్తుల బౌద్ధ ఆశ్రమంలో మఠాధిపతిగా కొనసాగుతూ ఉన్నాడు. నేను కూడా అక్కడ మూడున్నర సంవత్సరాల పాటు మఠాధిపతిగా కొనసాగాను.

**చేతబడులు, మహిమలు:**

చైనా, టిబెట్, జపాన్ మొదలయిన దేశాల్లో చేతబడి ద్వారా, క్షుద్రవిద్యల ద్వారా నాకు ఎన్నో మహిమలు చేకూరాయి. ఆ కాలంలో నేను చేతబడి ద్వారా ఆత్మలను ఆహ్వానిస్తూ వాటిచే భవిష్యవాణి పలికించే కార్యకలాపాల్లో నిమగ్నుడయి ఉండేవాడిని. 'కాళి', 'కాచీ', 'కలకత్తా కాళి', 'కేరళ దేవి'లను పూజించి రాగి రేకుల మీద రేదా రాగి దారాల మీద ఊది ప్రజలకు ఇస్తూ ఉండేవాడిని. అలాగే దేవతలను 101 వెండి పాత్రల్లో బంధించేవాడిని. నాకు ఏమీ తోచకపోతే ఆ పాత్రల్లోని దేవతలను బైటికి తీసి అంధకారంలో వాటితో మాట్లాడుతూ ఉండేవాడిని.

ఆ తర్వాత నేను నన్ను కలుసుకునేందుకు వచ్చినవారిలోనూ, ప్రపంచంలోని బౌద్ధు లందరిలోనూ దేవతల భాష పట్ల, వారి భవిష్యవాణుల పట్ల అవగాహన గలవాడిగా, వాటితో మాట్లాడే 'మహా గురువు ఆనంద్ జీ'గా సుప్రసిద్ధుడినయ్యాను.

**ఆశీర్వాదం:**

పలువురు నాయకులు, ప్రభుత్వాధినేతలు తమ తలల మీద నా పాదాన్ని ఉంచి ఆశీర్వాదం పొందడాన్ని మహాభాగ్యంగా భావించేవారు. సింగపూర్‌కు చెందిన మొదటి రాజు తల మీద నా పాదాన్ని ఉంచి మూడు పర్యాయాలు నేను అతన్ని ఆశీర్వదించాను. అదే విధంగా థాయ్‌లాండ్ రాణైన బర్మాపూజో టీసిప్విన్ తల మీద కూడా నా పాదముంచి ఆశీర్వదించాను. అదే విధంగా మన మాజీ ప్రధాన మంత్రి అయిన రాజీవ్ గాంధీ, జపాన్ ఉపాధ్యక్షుల తలల మీద పాదముంచి ఆశీర్వదించాను. శుక్రవారం నాడు, మంగళవారం నాడు నన్ను బంగారు సింహాసనం మీద నిల్చుండ బెట్టి ఒక నీటి కుండలోని నీటి ద్వారా నా పాదాలను కడగాలంటే ఒక లక్ష ఒక రూపాయిగా నిర్ణయించబడింది. ఆ నీటిని ఐదుగురు వ్యక్తులు తాగుతారు. మరి నేను దేవుని అవతారాన్ని కానా? (అని ఆనాడు భావిస్తూ ఉండేవాడిని).

బుద్ధుని మరొక జన్మలో రూపంగా, దేవతల అధ్యక్షునిగా, దేవుళ్ళతో మాట్లాడే సామర్థ్యాన్ని కలిగి ఉన్న దేశంలోనే కాకుండా ప్రపంచమంతటా పర్యటించేవానిగా నేను సుప్రసిద్ధుడినయ్యాను.

చికిత్స లేని వ్యాధులకు గురయిన ఎందరో వ్యాధిగ్రస్తులు నా మూత్రాన్ని త్రాగేవారు. తద్వారా వారికి ఆరోగ్యం చేకూరేది (అని వారు భావించేవారు). 'నా మూత్రాన్ని వారు త్రాగడంలో తప్పేముంది? ఎందుకంటే నేను దేవుడిని గదా!' (అని ఆనాడు భావిస్తూ ఉండేవాడిని.

(ఏషియన్ సైరెన్స్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో)

(ఇంకా ఉంది)



సయ్యద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ
abdussalamomri@gmail.com

అనురాగ రావం

# ప్రతిఘటన



**ఏకాంత** నిశ్శబ్దంతో సత్యం తన శక్తిని కళ్ళకు కడుతుంది. ప్రజలారా! నిశి రాత్రి నిశ్శబ్దంలో ఒంటరిగా ఉన్నప్పుడు మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీరు పవిత్రంగా భావించే కట్టుబాట్లను బేరీజు వేసుకోండి. ఈ లోకంలో 'నిన్నటివారు – రేపటివారు' అనే రెండు రకాల మనుషులుంటారు. మీరు దేనికి చెందినవారో ఆత్మ పరిశీలన చేసుకోండి. మీరు తేజోవంతమైన రేపటి జీవితంలో ప్రవేశించేవారో, లేక నిన్నటి అంధకార ఊబిలో మరింత లోతుకు కూరుకుపోయేవారో ఆత్మ విమర్శ చేసుకోండి. నిన్నటి బానిస బ్రతుకు మీకిష్టమో, రేపటి స్వేచ్ఛాయుత బంగారు భవిష్యత్తుకు బాట వేసుకుంటారో మీకు మీరే తేల్చుకోండి. మానవుని అంధ విశ్వాసాలు కడలిపై తేలియాడే నురుగు వంటివి. గాలి వీస్తే అది గల్లంతే! సత్యం వస్తే అంధ విశ్వాసాలన్నీ ఇక అంతే!!

ఆ విధంగా ప్రవక్త శ్రీ (ﷺ) ప్రజా విద్రోహక చర్యల్ని, శాంతి విఘాతక పద్ధతుల్ని, సమాజ విధ్వంసకర ధోరణిని ఖండించారు. సమాజాన్ని, ప్రజల్ని – వారి ఆచార వ్యవహారాల్ని, మూఢ నమ్మకాల్ని ప్రతిఘటించారు. శాంతి సందేశంతో ప్రజా విప్లవాన్ని తెచ్చేందుకు ప్రయత్నించారు.

మహా ప్రవక్త (ﷺ) వారి మాట అక్షర సత్యంగా, శైలి అందంగా, నడవడిక ఆకర్షణీయంగా ఉంది. ప్రజలు సత్యాన్ని ఆస్వాదించేలా చేస్తున్నది. ఇది గమనించిన కొందరు పుర ప్రముఖులు – ప్రవక్త శ్రీ (ﷺ) వారి సందేశం తమ ఇష్టారాజ్యాలకు ప్రమాదకరమైనదని భావించి ఆయన్ను అన్ని విధాలా నిలువరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన్ను, ఆయన పక్షాన నిలిచిన ఆయన వంశీయులను సంఘం నుండి బహిష్కరించి 'షోబె అబూ తాలిబ్' లోయలో మూడు ఏండ్ల పాటు నిర్బంధించారు. వారిపై అనుచితమైన ఆంక్షల భారాన్ని వేశారు. అప్పటికీ ఆయన్ను విశ్వసించినవారు చాలా మందే ఉన్నారు. ఆయన (ﷺ) వారి సందేశాన్ని తొలుత స్వీకరించినవారు; పురుషులలో – హజ్రత్ అబూ బకర్ (رضي). స్త్రీలలో హజ్రత్ ఖదీజా (رضي). వృద్ధులలో హజ్రత్ యాసిర్ (رضي). వృద్ధ స్త్రీలలో హజ్రత్ సుమయ్యా (رضي). బాలల్లో హజ్రత్ అలీ (رضي) ప్రముఖులు.

ముహమ్మద్ (ﷺ) సత్యసంధుడు – సచ్ఛీలత గల పరమ ఆదర్శ పురుషుడు. అయినప్పటికీ ధర్మం పేరుతో మా ఆచార వ్యవహారాలను తప్పు పడుతున్నాడు. మాది బూజు పట్టిన వ్యవస్థ అని, కాలం చెల్లిన శాస్త్రం అని కొట్టి పారేస్తున్నాడు. యజమాని – బానిస అన్న కృత్రిమమైన గీతలు సమసిపోవాలంటున్నాడు. బానిసగా మార్చబడ్డ వారే గానీ బానిసగా తల్లి కడుపున పుట్టిన ఒక్కడు కూడా లేడు అంటున్నాడు. మనిషిలోని మంచితనమే ఏ వంశ విశిష్టతకైనా వన్నె తెస్తుంది అంటున్నాడు. అతన్ని అనుసరించేవాళ్ళు దేన్నయినా వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ సత్యాన్ని మాత్రం ప్రాణాలు పోయినాగాని విడిచి పెట్టం అంటున్నారు. ఇది మన పూర్వీకులు ఏర్పరచిన వ్యవస్థపై తిరుగుబాటే. కాబట్టి మహమ్మద్ (ﷺ) ఆగడాలను ఎలాగైనా అరికట్టాలి. అతని పోకడలను నియంత్రించాలి.

అలా ప్రవక్త (ﷺ) వారిని ఎన్నో ఇబ్బందులకు గురి చేయడం జరిగింది. శారీరకంగా బాధించేవారు కొందరైతే, మానసికంగా క్షోభకు గురి చేసేవారు కొందరు. ఆయనపై చెత్తా చెదారం విసిరేసేవారు. రాత్రివేళ ఆయన నడిచి వెళ్ళే మార్గంలో ముళ్ళ కంపలు పడేసేవారు. ఆయన ప్రార్థన చేస్తుంటే దుప్పటిని త్రాడుగా చేసి గొంతు నులిమేసేవారు. ఆయన సజ్దాలో ఉండగా ఆయనపై ఒంటె ప్రేగుల్ని తీసుకొచ్చి పడేసేవారు. అందరూ ఆయన్ని బాధ పెట్టి పైశాచికంగా ఆనందిస్తున్నారు. తాము చేసిన ఘనకార్యాన్ని నలుగురితో చెప్పుకుని మీసాలు మెలేస్తున్నారు.

ఓ రోజైతే విసిరిన రాళ్ళ దెబ్బలకు దేహమంతా రక్తంతో తడిసి ముద్దయింది. తల సైతం పగిలి రక్తం చిమ్ముకొస్తూ ఉంది. ఆ రక్తాన్ని తుడుస్తూ చిన్న పిల్ల హజ్రత్ ఫాతిమా (رضي) నాన్నా! ఎందుకు మీకే ఇన్ని కష్టాలు? అని బోరున ఏడ్చేశారు. అమ్మా! నాకు జరిగింది తక్కువమ్మా. పూర్వం ప్రవక్తల్ని సత్యసందేశం అందజేసినందుకు శిక్షగా కొందరిని నిలబెట్టి నిలువునా రంపంతో చీరేస్తే, ఇంకొందరి దేహ మాంసాల్ని లోహపు దువ్వెనలతో లాగి ఎముకలుంచి వేరు చేసేవారు; మరికొందరి శిరస్సులను ఖండించి కాబోయే భార్యలకు బహుమానంగా ఇచ్చారు. అమ్మా! ధర్మ సంస్థాపన జరగనన్నా జరగాలి. లేదా ఈ మార్గంలో నా ప్రాణాలైనా పోవాలి. ధర్మసంస్థాపనార్థాయ వందసార్లు మరణించి వందసార్లు బ్రతికించబడినా నేను ధర్మోన్నతి కోసమే పోరాడుతాను. అన్నారు ప్రవక్త శ్రీ (ﷺ).

కెరటాల నురుగు చూసి, సాగర సామర్థ్యం అంచనా వేసినట్లు, మక్కా ప్రజలు ప్రవక్త (ﷺ) వారి సందేశాన్ని చిన్న చూపు చూశారు. ఇది చాలా తేలికైన విషయంగా భావించారు. ఆయన సందేశం సత్య సస్య విప్లవానికి నాంది అని వారు ఆ క్షణం గ్రహించలేకపోయారు. జీవిత వాస్తవమే సత్యం. దాని ఆది ఏ గర్భంలోనూ లేదు. దాని అంతం ఏ సమాధిలోనూ లేదు. అది నిత్యం – నిర్మలం. అది నిజం – మారని బీజం.

# మానవ సృష్టి ఒక అద్భుత ప్రక్రియ



**అనంత** కాలంలో మానవుడు చెప్పుకోదగిన వస్తువు కాకుండా ఉండిన సమయం ఏదైనా అతనిపై గడిచిందా? మేము మానవుణ్ణి పరీక్షించటానికి అతన్ని ఒక మిశ్రమ వీర్య బిందువుతో పుట్టించాము. (76:1,2)

**మే**ము మానవుణ్ణి కుళ్ళిన మట్టి యొక్క ఎండిన గారతో సృష్టించాము. దీనికి పూర్వం జిన్నాతులను మేము తీవ్రమైన ఉష్ణజ్వాలతో సృష్టించి ఉన్నాము. నీ ప్రభువు దైవ దూతలతో ఇలా అన్న సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో: "నేను కుళ్ళిన మట్టి యొక్క ఎండిన గారతో ఒక మానవుణ్ణి సృష్టిస్తున్నాను. నేను అతణ్ణి పూర్తిగా తయారు చేసి, అతనిలో నా ఆత్మను కొద్దిగా ఊదినప్పుడు, మీరంతా అతని ముందు సాష్టాంగ పడాలి".
(15: 26-29)

**మే**ము ఆదం సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. వారికి నేలపై, నీటిలో నడిచే వాహనాలను ప్రసాదించాము. వారికి పరిశుద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము. ఇదంతా మా అనుగ్రహం. (17: 70)



**ఓ** మానవులారా! ఒకవేళ మీకు మరణానంతర జీవితం గురించి ఏదైనా సందేహం ఉంటే, మీరు ఒక విషయాన్ని తెలుసుకోవాలి - (అదేమంటే) మేము మిమ్మల్ని మట్టితో, ఆ తర్వాత నెత్తుటి గడ్డతో, ఆపైన మాంసపు కండతో, అది రూపం కలదిగానూ, రూపం లేనిదిగానూ ఉంటుంది. మీకు యదార్థమేమిటో స్పష్టం చేయాలని (మేము ఈ విషయాన్ని తెలుపుతున్నాము). మేము కోరిన దానిని ఒక ప్రత్యేక కాలం వరకు మాతృగర్భాలలో నిలిపి ఉంచుతాము. తరువాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటికి తీస్తాము - మీరు నిండు యౌవన దశకు చేరటానికి. మీలో ఒకడు ముందుగానే వెనుకకు పిలుచుకోబడతాడు. మరొకడు అతి నికృష్టమైన వయస్సు వైపునకు మరలింపబడతాడు - అంతా తెలిసిన తర్వాత కూడా ఏమీ తెలియకుండా ఉండటానికి. ఎండిపోయిన నేలను మీరు చూస్తున్నారు. తర్వాత మేము దానిపై వర్షం కురిపించగానే అకస్మాత్తుగా అది పులకిస్తుంది, ఉబుకుతుంది. ఇంకా అది అన్ని రకాల మనోహరమైన మొక్కలను మొలకెత్తించటం ప్రారంభిస్తుంది. (22:5)

**మే**ము మానవుణ్ణి అద్భుతమైన ఆకృతిలో సృజించాము. తరువాత మేమతన్ని వెనక్కి త్రిప్పి నీచాతి నీచుడిగా మార్చివేశాము. అయితే విశ్వసించి, మంచి పనులు చేసిన వారు మాత్రం అలాంటి వారు కారు. వారికి ఎన్నటికీ తరగని పుణ్యఫలం లభిస్తుంది. (95: 4-6)

హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్

ఇస్లాం శిక్షణ



# నమాజు నియమాలు

**నమాజ్ కోసం ఈ క్రింది షరతులకు కట్టుబడాలి:**

1) నమాజ్ వేళ అవటం.
2) మలమూత్ర అశుద్ధతలు లేకుండా పరిశుభ్రంగా ఉండటం.
3) నమాజు చేసే వ్యక్తి శరీరం, దుస్తులు, నమాజ్ చేసే చోటు పరిశుభ్రంగా ఉండటం.
4) సతర్ (ఆచ్ఛాదన).
5) ఖిబ్లా దిక్కుకు తిరిగి నిలబడటం
6) నమాజ్ చేస్తున్నానని మనసులో నిర్ణయించుకోవటం.

**నమాజులోని ముఖ్యాంశాలు, ఫర్జులు**

**నమాజ్‌లోని ముఖ్యాంశాలు (అర్కాన్), ఫర్జులు (విధిగా చేయదగిన విషయాలు) క్రింద పేర్కొనబడ్డాయి.**

1) సంకల్పం (నియ్యత్) చేసుకోవటం
2) ఖియామ్ (శక్తి గలవారు నిలబడటం).
3) తక్బీరె తహ్రీమా (నమాజ్ ప్రారంభించేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని అనటం). అంటే నమాజు ప్రారంభించటానికి పలికే తక్బీరును 'తక్బీరె తహ్రీమా' అంటారు.

**నోట్:** ఈ తక్బీరును పలకటం విధి. ఇది పలకకపోతే అసలు నమాజే నెరవేరదు. ఇకపోతే నమాజు ప్రారంభించిన తర్వాత ఒక స్థితి నుంచి మరొక స్థితికి (ఉదా; ఖియామ్ నుంచి రుకూకు లేక రుకూ నుంచి ఖౌమాకు) బదిలీ అయ్యేటప్పుడు పలికే తక్బీర్లన్నీ వాజిబ్ (తప్పనిసరిగా చెప్పవలసిన) తక్బీర్లుగా భావించబడతాయి. విధి (ఫర్జ్) అన్నా తప్పనిసరి (వాజిబ్) అన్నా ఒకటే కదా అని మీకు సందేహం రావచ్చు. కాని షరీఅత్‌లో వాజిబ్ అనేది ఫర్జ్‌కంటే కొంచెం తక్కువ స్థాయి కలిగిన అంశం అన్న మాట.!

4) ఫాతిహా సూరా పఠనం.
5) రుకూ చేయటం (తల, వీపు సమాంతరంగా ఉండేటట్లు వంగటం.
6) ఖౌమా చేయటం, అంటే రుకు నుంచి లేచి నిటారుగా నిలబడటం.
7) తాదీల్, అంటే రుకూ సజ్దాలు, మొదలైన అంశాలన్నింటినీ పూర్తి నింపాదిగా నెరవేర్చడం.
8) ఏడు ఎముకల ఆధారంగా సజ్దా చేయటం. అంటే రెండు చేతులు, రెండు పాదాల వ్రేళ్ళు, రెండు మోకాళ్ళు, ముక్కు సహితంగా నుదురును నేలకు ఆనించి సజ్దా చేయటం.
9) సజ్దా స్థితి నుండి పైకి లేవటం.
10) రెండు సజ్దాల మధ్య స్థిమితంగా కూర్చోవటం.
11) నమాజులోని ముఖ్యాంశాలన్నింటినీ ప్రశాంతంగా, నింపాదిగా నెరవేర్చటం.
12) మూడు లేక నాలుగు రకాతులుండే నమాజులోని ఆఖరి రకాత్ చివర్లో కూర్చోవటం.
13) కుడి, ఎడమల వైపు మెడ త్రిప్పుతూ 'అస్సలాము అలైకుమ్' అని పలకటం. (కుతుబె సిత్తా)
14) నమాజు విధుల క్రమాన్ని పాటించటం. అంటే- ముందు నియ్యత్. తర్వాత ఖియామ్, రుకూ, సజ్దా, ఖఅదా, ఆ తర్వాత సలామ్. (వీటిలో ఏ ఒక్కటినీ ముందూ వెనకా చేయడానికి వీలు లేదు).



**వాజిబాతె నమాజ్ (నమాజులో తప్పనిసరి అంశాలు)**

**నమాజ్‌లో తప్పనిసరిగా ఈ క్రింది పనులు చేయాలి:**

1) తక్బీరె తహ్రీమా తప్ప ఇతర తక్బీర్లు పలకటం (అంటే తక్బీరె తహ్రీమా పలకటం విధి. మిగతా తక్బీర్లు పలకటం తప్పనిసరి అన్న మాట!)
2) రుకూ నుండి తల పైకెత్తినప్పుడు "సమిఅల్లాహు లిమన్ హమిదహ్" అని పలకటం.
3) రుకూ స్థితిలో 'సుబ్హాన రబ్బియల్ అజీమ్' అని పలకటం.
4) ఇమామ్ వెనుక ఉండే ముక్తదీలు 'రబ్బనా వలకల్ హమ్ద్' అని చెప్పటం.
5) సజ్దా స్థితిలో 'సుబ్హాన రబ్బియల్ అలా' అనే తస్బీహ్ పఠించటం.
6) ఫజ్ర్, మగ్రిబ్, ఇషా నమాజులలో మొదటి రెండు రకాతులలో బిగ్గరగా సూరాలు చదవటం. జుహ్ర్, అస్ర్ నమాజుల అన్ని రకాతులలో నెమ్మదిగా (లోలోపల) పారాయణం చేయటం.
7) మూడు లేక నాలుగు రకాతుల నమాజులోని రెండవ రకాతు చివర్లో (మొదటి తషహుద్ కోసం) కూర్చోవటం.
8) మొదటి, రెండవ రకాతుల్లో ఫాతెహా సూరా చదివిన పిమ్మట మరికొన్ని దివ్య ఖుర్ఆన్ సూక్తులు పఠించటం.
9) చివరి ఖఅదాలో తషహ్హుద్ అనంతరం దరూద్ ఇబ్రాహీమ్ చదవటం. (సిహాహ్ సిత్తా)

**గమనిక:** వాజిబాతులలోని ఏ ఒక్క వాజిబ్ తప్పినా సజ్దా సహూ చేయాలి.

**ఒక అపోహ:**

సాధారణంగా కొంతమంది అనుకుంటారు, "నమాజులోని దుఆలను, ప్రార్థనా వచనాలను అరబీ భాషలోనే ఎందుకు వల్లించాలి? వాటి అర్థాన్ని తెలుగులోనే పఠిస్తే బాగుంటుంది కదా!" అని. కాని నిజానికి దానివల్ల లాభం కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి. ఇతర భాషల్లో పఠించడం వల్ల దైవ ప్రవక్త (ﷺ) పలుకుల్లోని శుభం ప్రాప్తం కాదు. అదీగాక దైవ ప్రవక్త (ﷺ) ఈ విధంగా ప్రార్థనా వాక్యాలను మార్చి చదవటాన్ని వారించినట్లు కూడా ఉల్లేఖనాలున్నాయి. అన్నింటినీ మించి ఈ విధంగా వేర్వేరు భాషల్లో చదవటం వల్ల అర్థ సారూప్యత, ముస్లింల భావ సమైక్యత, ధర్మ సమగ్రతలు దెబ్బ తింటాయి.



షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

# సీరత్ క్విజ్

**ప్రశ్న: ఉత్బా బిన్ రబీఅకు దైవప్రవక్త (స) ఇచ్చిన జవాబేమిటి?**

జ: దైవప్రవక్త (స) అతను చెప్పినదంతా విని, నేను చెప్పేది కూడా విను అంటూ దివ్య ఖుర్ఆన్‌లోని హామీమ్ సూరాను పఠించారు.

**ప్రశ్న: ఖుర్ఆన్ వాక్యాలు విని ఉత్బా ప్రభావితుడయ్యాడా?**

జ: అవును. అందమైన భాషా మాధుర్యానికి ముగ్ధుడయ్యాడు.

**ప్రశ్న: ఉత్బా స్నేహితులు అతని ముఖంపై మార్పులు చూసి ఏమన్నారు?**

జ: 'అతని గాలి నీకు కూడా సోకినట్లుందే' అన్నారు.

**ప్రశ్న: ఉత్బా వారికి ఏమి సమాధానమిచ్చాడు?**

జ: నేను అక్కడ విన్నది నా జీవితంలో ఎప్పుడూ వినలేదు. దైవసాక్షి! అది కవిత్వం గానీ, ఇంద్రజాలం గానీ, జోతిష్యుల మంత్రాలు గాని కాదు. నా ఉద్దేశంలో అతణ్ణి అతని మానాన వదిలేసి మౌనంగా కూర్చొని ఉండండి. ఒకవేళ అతన్ని మిగతా అరబ్బులు చంపేస్తే మీ పని ఇతరులు చేసిపెట్టినట్లవుతుంది. లేదా అతనే అరబ్బుల్ని జయిస్తే అతని రాజ్యాధికారం మీ రాచరికమే అవుతుంది. అతని గౌరవం మీ గౌరవమే. అతని అస్తిత్వం అందరికంటే మీ శ్రేయం కోసమే సుమా" అని చెప్పి ఊరకుండిపోయాడు.

**ప్రశ్న: బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్‌కు వ్యతిరేకంగా సంఘ బహిష్కరణ ఎప్పుడు జరిగింది?**

జ: దైవ ప్రవక్త (స)కు ప్రవక్త పదవి లభించిన 7వ సంవత్సరం మొదలై 10వ సంవత్సరం వరకు ఈ ఆంక్ష సాగింది.

**ప్రశ్న: సంఘ బహిష్కరణకు కారణమేమిటి?**

జ: హజ్రత్ హమ్‌జ మరియు హజ్రత్ ఉమర్ (ర) ఇస్లాం స్వీకరించిన తరువాత రోజురోజుకు ముస్లింల సంఖ్య పెరుగుతూ ఉండటం, బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్ కుటుంబాలకు చెందిన వారంతా ఒక్కటై దైవ ప్రవక్త (స)ను సంరక్షించే ప్రమాణం చేయడం, ఈ పరిణామాలకు బహుదైవారాధకులు తెల్లబోయి ఈ చేష్టకు పాల్పడ్డారు.

# చైతన్య జ్యోతులారా!

- సల్మానా

చైతన్య జ్యోతులారా - నవ జీవన స్రవంతులారా!
శీలవతులారా - కోమల మనస్కులారా
సత్యవతులారా - త్యాగమయిలారా
అబలలు కాదు సబలలు మీరమ్మా!!
మీ పాదాల చెంత స్వర్గముందమ్మా!!!


సహనానికి మీరే మాతృకలు - శాంతానికి మీరే ఏలికలు
స్నేహానికి మీరే పల్లికలు - మమతలకు మీరే మల్లికలు
ఆప్యాయతను పెంచే అమ్మలు మీరమ్మా..
తత్వవేత్తల ఉనికికి తల్లులు మీరమ్మా...
ప్రవక్తలు పెరిగింది మీ ఒడిలోనేయమ్మా..

సౌమ్యానికి మీరే సుమలతలు - సాత్వికత పంచే సహన శీలులు
వినయానికి మీరే పొందికలు - విధేయతకు మీరే తారకలు
సత్యాత్ముల్ని సాకిన సాహస వనితలు మీరమ్మా!
దురాత్ముల్ని చెండాడిన వీర మాతలు మీరమ్మా!

ఇంటికి మీరే దీపాలు - ప్రేమకు మీరే ప్రతిరూపాలు
సమరానికి మీరే ప్రేరకులు - విజయానికి మీరే కారకులు
ఆసియా సయ్యిదా సోదరిలోయమ్మా...
మర్యం సయ్యిదా వారసులోయమ్మా...
ఖదీజా తాహిరా కూతురులోయమ్మా...
ఆయిషా సిద్దీఖాకు శిష్యులోయమ్మా...
ఫాతిమా సయ్యిదాకు ప్రియ సఖులోయమ్మా...
ఖుర్ఆన్ చదువుతూ కదలాలోయమ్మా...
ధర్మ తేజమై వెలగాలోయమ్మా!







షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

# ఇస్లాం దృష్టిలో సమాధుల పూజ

## దైవ ప్రవక్తల ధ్యేయం దేవుని ఏకత్వ పరిచయం

దైవ ప్రవక్తల సందేశం ఇహపరలోకాల మేళ్ళతో కూడుకున్నది. వారందరూ తమ అనుయాయులకు అన్ని విధాలా మేలైన బోధనలు చేశారు. అన్ని రకాల చెడుల గురించి బయపెట్టారు. ఖుర్ఆన్ మరియు దైవ ప్రవక్త (ﷺ) జీవిత చరిత్ర చదివిన తర్వాత తెలిసేదేమిటంటే అసలు వారి సందేశమే తౌహీద్‌ని వ్యాపింపజేయటం, షిర్క్‌ని ఖండించటం. అల్లాహ్ ఏకత్వాన్ని ప్రపంచంలో వ్యాపింపజేసే ప్రయత్నంలోనే వారు తమ జీవితాలను అర్పించారు. అసలు వారు ప్రపంచంలో పంపబడినది ఈ కార్యం కోసమే. ఎందుకంటే షిర్క్ అతి ఘోరమైన పాపం. ఎవరైనా షిర్క్‌లోనే మరణిస్తే అతనికి క్షమాపణ లేదని అల్లాహ్ సెలవిస్తున్నాడు:

**"అల్లాహ్ తనకు సాటి కల్పించడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప మరే పాపాన్నయినా తాను తలచుకుంటే క్షమిస్తాడు".** (అన్ నిసా: 116)

"అల్లాహ్‌కు సాటి కల్పించేవారికి అల్లాహ్ స్వర్గ ప్రవేశం నిషేధించాడు. వారి నివాసం నరకం అవుతుంది". (మాయిదా: 72)

"అల్లాహ్‌కు సాటి కల్పించినవాడు ఆకాశం నుండి అమాంతం అధఃపాతాళంలోకి పడిపోయినట్టే. ఇక అతణ్ణి పక్షులైనా పొడుచుకు తింటాయి. లేదా గాలి అయినా ఎత్తి దూరంగా పడేస్తుంది". (హజ్జ్: 31)

మహా ప్రవక్త (ﷺ) కూడా తన తౌహీద్ (ఏకదైవారాధన) సందేశాన్ని, షిర్క్‌కు, విగ్రహ పూజకు వ్యతిరేకంగానే ప్రారంభించారు. తత్కారణంగా అరబ్బులంతా ప్రాణ శత్రువులైనప్పటికీ ఆయన (ﷺ) తన సందేశాన్ని మానుకోలేదు. ధనం, ఆస్తి, గౌరవం, నాయకత్వం ఇస్తామనీ ప్రలోభ పెట్టారు. రాజుగా పరిగణిస్తామని ఊరించారు. అయినా దైవ ప్రవక్త (ﷺ) ను లొంగదీసుకోలేక పోయారు.

మక్కా విజయం తర్వాత భూమిని విగ్రహ పూజ నుంచి పవిత్రం చేయటానికి పూను కున్నారు. ఎందుకంటే మానవ సంతతికి పొంచివున్న అతి పెద్ద ప్రమాదం వీటితోనే. అందుకే ప్రవక్తల పితామహుడైన ఇబ్రాహీమ్ (عليه السلام) ఈ విధంగా ప్రార్థించ వలసి వచ్చింది:

**"ప్రభూ! ఈ (మక్కా) నగరాన్ని శాంతి నగరంగా చెయ్యి. నన్ను, నా సంతానాన్ని విగ్రహారాధన బారి నుండి కాపాడు. ప్రభూ! ఈ విగ్రహాలు అనేక మందిని దారి తప్పించాయి".** (ఇబ్రాహీం:35,36)

దైవ ప్రవక్త (ﷺ) మక్కా విజయం తర్వాత అనేక మంది శిష్యులను పలు చోట్ల పూజింపబడే విగ్రహాలను పడగొట్టటానికి పంపించారు.

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ అల్ బజలీ (رضي الله عنه) కథనం: అజ్ఞాన కాలంలో యమన్‌లో ఒక ఇల్లు ఉండేది. దానికి – 'జుల్ ఖల్స', 'అల్ కాబతుల్ యమానియ్య', 'అల్ కాబతుష్షామియ్య' అని పేర్లుండేవి. దైవ ప్రవక్త (ﷺ) నాతో "మీరు 'జుల్ ఖల్స' విషయంలో నా వ్యాకులతను ఎందుకు దూరం చేయరు?" అని అన్నారు. నేను అహ్మస్ తెగకు చెందిన 150 సైనికులతో పోయి 'జుల్ ఖల్స'ను పడగొట్టి అక్కడుండే వారిని హతమార్చి, దైవ ప్రవక్త (ﷺ)కు కబురు పంపించగా, ఆయన (ﷺ) నా తెగవారిని కోసం దుఆ చేశారు.

బుఖారీలో ఈ విధంగా ఉంది: 'జుల్ ఖల్స' యమన్‌లో ఖస్అమ్ మరియు బజైలాకు చెందిన ఒక గృహం పేరు. అందులో విగ్రహారాధన జరుగుతుండేది. దాన్ని 'కాబా'గా కూడా వ్యవహరించేవారు అక్కడి ప్రజలు.

విగ్రహాల ఉనికి దైవ ప్రవక్త (ﷺ) వారి కంటికి కునుకు లేకుండా చేసిందని వాటిని నిర్మూలించేవరకు దైవ ప్రవక్త (ﷺ)కు మనశ్శాంతి కలగలేదని ఈ హదీసు ద్వారా తెలుస్తుంది.

హజ్రత్ అబూ తుఫైల్ ఆమిర్ బిన్ వాసిలా (رضي الله عنه) ఇలా చెప్పారు: "దైవ ప్రవక్త మక్కాను జయించినప్పుడు ఖాలిద్ బిన్ వలీద్ (رضي الله عنه)ని 'నఖ్ల' ప్రాంతానికి పంపారు. అక్కడ 'ఉజ్జా' అనే విగ్రహం దైవంగా కొలవబడేది. అది కటకటాలతో కూడుకున్న మూడు తలుపుల

వెనకాల ఉండేది. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర) ఆ తలుపులను బద్దలు కొట్టి, ఉజ్జా కోసం తయారు చేసిన ఆ గృహాన్ని కూలదోసి దైవ ప్రవక్త (స) వద్దకు వచ్చి చెప్పగా – మళ్ళీ వెళ్ళండి ఇంకా కార్యం పూర్తవలేదన్నారు. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర) రెండోసారి వెళ్ళగా అక్కడుండే విగ్రహారాధకులు ఆయన్ను చూసి – "యా ఉజ్జా! యా ఉజ్జా!" అంటూ పరుగెత్తు కుంటూ వెళుతూ సమీప కొండ గుహలో తల దాచుకున్నారు. అక్కడ హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర) ఒక నగ్న స్త్రీని చూశారు. (అనంతపూర్ జిల్లాలోని దిగంబర దేవత మాదిరి.) ఆమె తన తలపై మట్టి వేసుకుంటున్నది. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర) ఆమెను ఖడ్గంతో చంపేసి దైవ ప్రవక్త (స) వద్దకు వచ్చి చెప్పగా, అప్పుడు ఆయన (స) 'ఇదే ఉజ్జా' అని అన్నారు.

(నసాయి, తఫ్సీర్ ఇబ్ను కసీర్)

3) **మనాత్:** ఈ విగ్రహం మదీనా (యస్రిబ్) లో ఔస్, ఖజ్రజ్ తెగల ఆరాధ్య దేవత. దైవ ప్రవక్త (స) అబూ సుఫ్యాన్ బిన్ హరిస్ (ర)ను లేదా హజ్రత్ అలీ (ర) గారిని దాన్ని పడగొట్టేందుకు పంపించారు.

4) **లాత్:** సఖీఫ్ తెగవారు తమ ఆరాధ్య దైవం అయిన లాత్ విగ్రహాన్ని 3 సంవత్సరాల వరకూ పడగొట్టకూడదని దైవ ప్రవక్త (స)కు విన్నవించుకున్నారు. దైవ ప్రవక్త (స) వారి ప్రతిపాదనను అంగీక రించలేదు. ఒక్క సంవత్సరమన్నా వదిలేయండి అని అడగ్గా దైవ ప్రవక్త (స) దానికీ ఒప్పుకోలేదు. కనీసం ఒక నెల గడువు ఇవ్వండి అని అడిగినా అందుకు ఆయన (స) నిరాకరించారు. అసలు విషయం ఏమిటంటే, వారి ఈ దేవత జోలికి పోకుండా ఉంటే అది తమ ధన, మాన, ప్రాణాల్ని కాపాడుతుందన్నది వారి నమ్మకం. దానిని పగలగొడితే అది వారికి హాని కలిగిస్తుందన్నది వారి భయం. కాని దైవ ప్రవక్త (స) ఒక రోజయినా ఆలస్యం చేయకుండా అబూ సుఫ్యాన్ మరియు ముగీరా బిన్ షోబా (ర)లను ఆ విగ్రహాన్ని పడగొట్టటానికి పంపించారు.

(సీరతు ఇబ్ను హిషామ్: 1/8586)

ఖతాదా, ఇబ్నె అబ్బాస్, ముజాహిద్ మరియు ఇబ్నె జైద్ మొదలగు ధర్మవేత్తల వ్యాఖ్యానం: లాత్ అనే వ్యక్తి 'సత్తు' అనే వంటకాన్ని తయారు చేసేవాడు. అతను చనిపోయిన తర్వాత జనులు అతని సమాధిని పూజించ సాగారంభించారు.

(తఫ్సీర్ తబరీ 27/58, 59
సీరతు ఇబ్ను హిషామ్: 28,29)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) కథనం ప్రకారం: 'లాత్, ఉజ్జా'లలో – లాత్ అనబడే వ్యక్తి హజ్ యాత్రికుల కొరకు 'సత్తు' అనే పిండి వంటకాన్ని తయారు చేసేవాడు. (బుఖారీ- కితాబుత్తఫ్సీర్: తఫ్సీర్ సూరతున్నజ్మ్)

## సమాధి పూజ నిషిద్ధం

దైవ ప్రవక్త (స) షిర్క్ వైపునకు వెళ్ళే అన్ని మార్గాలను మూసి వేశారు. షిర్క్ పనుల నుండి కఠినంగా వారించారు. ఈ షిర్క్ పోకడలలో సమాధి (దర్గాహ్) పూజ కూడా ఒకటి. జనులను సమాధి పూజ నుండి, సమాధుల్లో ఉన్నవారి విషయంలో మితిమీరి ప్రవర్తించటం నుండి కాపాడటానికి దైవ ప్రవక్త (స) కొన్ని నిర్దేశిత నియమాలను ఖరారు చేశారు. వాటిలో కొన్ని–

1) దైవ ప్రవక్త (స) ఔలియా, పుణ్యాత్ముల విషయంలో మితిమీరి ప్రవర్తించడం గురించి హెచ్చరించారు. ఎందుకంటే పుణ్య పురుషుల పట్ల ప్రజలకున్న ఆదరాభిమానాలు గాడి తప్పి వారి ఆరాధనకు దారి తీసే ప్రమాదం ఉంది గనక. దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ప్రజలారా! మీరు ధర్మం (దీన్) విషయంలో అతిశయిల్లకండి. ఎందుకంటే మీ పూర్వీకులను ఈ అతివాదమే, వితండ విధానమే సర్వనాశనం చేసింది".

(సహీహ్ నసాయీ)

ఇంకా ఇలా చెప్పారు: "క్రైస్తవులు మర్యం కుమారుడగు ఏసు విషయంలో మితిమీరి ప్రవర్తించినట్లు మీరు నా విషయంలో వ్యవహరించకూడదు సుమా! నేను అల్లాహ్ దాసుణ్ణి. అందుచేత నన్ను అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్తగానే ఎంచండి".

(బుఖారీ – ముస్లిం)

2) దైవ ప్రవక్త (స) సమాధులపై నిర్మాణాలు చేయటాన్ని నిషేధించారు. అబుల్ హయాజ్ అల్ అసదీ కథనం: నాతో అలీ (ర) చెప్పారు –"దైవ ప్రవక్త (స) ఏ కార్యం కొరకు నన్ను పంపారో ఆ కార్యం కొరకు నేను మిమ్మల్ని పంపించనా? అదేమంటే, మీరు విగ్రహాల్ని తొలగించండి. ఎత్తుగా నిర్మించబడిన సమాధులను నేల మట్టం చేసివేయండి".

(ముస్లిం)

3) సమాధులను పటిష్టపర్చడం వాటిపై కట్టడాలు, గుంపటాలు లాంటివి నిర్మించటాన్ని దైవ ప్రవక్త (స) ఖండించారు. జాబిర్ (ర) గారి కథనం: దైవ ప్రవక్త (స) సమాధులను గట్టిగా తయారు చేయటం, వాటిపై ముజావర్ అయి కూర్చోవటం, వాటిపై కట్టడం వంటివి నిర్మించడాన్ని నిషేధించారు. (ముస్లిం)

సహీహ్ ముస్లిం ఉల్లేఖనం: సుమామ బిన్ షఫీ (ర) ఇలా అన్నారు – మేము ఫుజాల బిన్ ఉబైద్ (ర)ని కలిసి రోమ్ (ఇటలీ)లోని రోడ్స్ ద్వీపంలో ఉండేటప్పుడు మా సోదరుడు ఒకతను మరణించాడు. అంత్యక్రియల తర్వాత సమాధి భూమికి సమానంగా నేలమట్టం చేయమని ఫుజాల (ర) చెబుతూ 'దైవ ప్రవక్త (స) సమాధులను నేల మట్టంగా చేయమని చెప్పగా నేను విన్నాను' అని అన్నారు.

## 4) సమాధుల వద్ద నమాజు చేయకూడదు

హజ్రత్ ఆయిషా (ర) కథనం: దైవ ప్రవక్త (స) కు మరణ ఘడియలు ఆసన్నమైనప్పుడు ఆయన పరిస్థితి చాలా బాధాకరంగా ఉండేది. ఒక్కోసారి ఆయన తన దుప్పటిని ముఖం మీదికి లాక్కునేవారు. కాసేపటికి ఊపిరాడకపోవడంతో ముఖం మీది దుప్పటి మళ్ళీ తొలగించేవారు. అలాంటి స్థితిలో సైతం ఆయన (స) (సమాధి పూజారులను శపిస్తూ) "యూదులు, క్రైస్తవులు తమ ప్రవక్తల సమాధుల్ని ప్రార్థనాస్థలాలుగా చేసుకున్నారు. అల్లాహ్ వారిని శపించుగాక!" అని అన్నారు. అంటే– ఆయన (స) ముస్లింలు ఇలాంటి దుష్కార్యాలకు పాల్పడకూడదని పరోక్షంగా హెచ్చరించారు. అమ్మ ఆయిషా (ర) దీనిపై ఇలా వ్యాఖ్యానించారు: ఒకవేళ దైవ ప్రవక్త (స) ఇలా మందలించి ఉండకపోతే ఆయన సమాధి (ప్రజల దర్శనార్థం) తెరచి ఉంచబడేది. అంతేకాదు, అది కొంత కాలానికి ప్రార్థనా స్థలంగా మారిపోయేదన్న భయం ఉండేది. (అందుకే తెరచి ఉంచలేదు). (బుఖారీ-ముస్లిం)

ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "జాగ్రత్త! మీ పూర్వీకులు ప్రవక్తల, పుణ్యాత్ముల సమాధులను ప్రార్థనా స్థలంగా మార్చుకున్నారు. జాగ్రత్త! మీరు మాత్రం సమాధులను ప్రార్థనా స్థలంగా చేసుకోకండి. నేను దాని నుండి మిమ్మల్ని వారిస్తున్నాను". (ముస్లిం)

సమాధుల్ని ప్రార్థనా స్థలంగా చేసుకోవడం అంటే సమాధి దగ్గర నమాజు చేయడం. మస్జిద్ నిర్మించకపోయినా నమాజు చేయబడే ప్రతి చోటును మస్జిద్ అంటారు. "నా కోసం యావత్తు భూమండలం ప్రార్థనా స్థలంగా, పరిశుద్ధమైనదిగా చేయబడింది" అని దైవ ప్రవక్త (స) చెప్పారు. (బుఖారీ)

(ఇంకా ఉంది)

హాఫిజ్ ఇస్హాఖ్ జాహిద్

# ముహర్రమ్‌లో చేస్తున్నదేమిటి? చేయాల్సిందేమిటి?

**మానవ** జాతి చరిత్రలో ముహర్రమ్ మాసానికి గల ప్రాముఖ్యం ఎనలేనిది. హిజ్రీ క్యాలెండర్ ప్రకారం ఇది మొదటి నెల. అల్లాహ్ తరఫున నిషిద్ధ (పవిత్ర) మాసాలుగా ప్రకటించబడిన వాటిలో ఒక నెల. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:
"నిశ్చయంగా భూమ్యాకాశాలను అల్లాహ్ సృష్టించినప్పటి నుంచీ మాసాల సంఖ్య దైవగ్రంథంలో పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (పవిత్రమైనవి). ఇదే సరైన ధర్మం. కనుక ఈ నాలుగు మాసాలలో మీ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టకండి".
(అత్తౌబా: 36)

ఇంతకీ ఆ నిషిద్ధ (పవిత్ర) మాసాలేవి? దీనికి సమాధానం ఈ హదీసులో ఉంది:
హజ్రత్ అబూ బక్రా (رض) కథనం ప్రకారం దైవ ప్రవక్త (ﷺ) ఇలా ప్రవచించారు: "సంవత్సరం 12 మాసాలతో కూడుకున్నది. వాటిలో నాలుగు మాసాలు పవిత్రమైనవి (గౌరవనీయమైనవి, నిషిద్ధమైనవి). వాటిలో మూడు ఒక దాని తర్వాత ఒకటి వస్తాయి – అంటే జుల్‌ఖఅదా, జుల్ హిజ్జా, ముహర్రమ్ (మాసాలు). నాల్గవది రజబ్ మాసం. అది జమాదిల్ఆఖిర్‌కి – షాబాన్‌కి మధ్యన ఉన్నది".
(బుఖారీ)

"కాబట్టి (ఈ మాసాలలో) మీరు మీ ఆత్మలకు అన్యాయం చేసుకోకండి" అని దేవుడు తాకీదు చేసి మరీ చెప్పడం గమనార్హం. ఆ మాటకొస్తే అన్యాయం, అక్రమం, దౌర్జన్యం అనేది ఎప్పటికీ నిషిద్ధమే. కాని ఈ నాలుగు మాసాల పేర్లను ప్రస్తావించి వాటి గౌరవ మర్యాదలకు, చారిత్రక ప్రాశస్త్యానికి విఘాతం కలిగించరాదని చెప్పడం వెనుక గల ఔచిత్యాన్ని మనం తరచి చూడాలి.

ఇంతకీ ఇక్కడ అన్యాయం (జుల్మ్) చేయడమంటే అర్థం; ఈ మాసాలలో కయ్యానికి కాలు దువ్వటం, హత్యలు చేయటం, రక్త పాతం సృష్టించటం. దీనికి ఆధారం క్రింది వచనంలో ఉంది:
"నిషిద్ధ మాసాలలో యుద్ధం చేయటం గురించి ఈ జనులు నిన్ను అడుగుతారు. (ఓ ప్రవక్తా!) ఆ మాసాలలో యుద్ధం చేయటం మహాపరాధం అని నీవు వారికి చెప్పు". (అల్ బఖర: 217)

ఇస్లాంకు పూర్వం (అజ్ఞానకాలంలో) కూడా ప్రజలు ఈ నాలుగు మాసాల పవిత్రతను దృష్టిలో పెట్టుకుని యుద్ధ విరమణ చేసేవారు. హింసాదౌర్జన్యాలకు దూరంగా మసలుకునేవారు. తర్వాత ఇస్లాం కూడా ఈ 'పవిత్రత'ను, 'ప్రతిపత్తి'ని అక్షరాల గౌరవిస్తూ వాటిలో యుద్ధాలు చేయటాన్ని ఘోర నేరంగా ఖరారు చేసింది.

ఈ నాలుగు మాసాలలో దేవుని అవిధేయతకు ఒడిగట్టడం, దైవాజ్ఞల పట్ల ఉల్లంఘనకు పాల్పడటం, ధర్మంలో లేనిపోని పోకడలను సృష్టించుకుని అనవశ్యంగా ప్రవర్తించడం కూడా అన్యాయం (జుల్మ్) క్రిందికి వస్తుంది.

హాఫిజ్ ఇబ్ను కసీర్ (రహ్మ) హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (رض) గారి మహితోక్తులను ఉటంకిస్తూ ఇలా అన్నారు: అన్యాయం ఎప్పుడు చేసినా అది అన్యాయమే. కానీ ఈ నాలుగు మాసాలలో దేవుడు విధించిన హద్దుల విషయంలో మరింత ఎక్కువ జాగ్రత్త వహించాలి. ఈ నెలల్లో చేసిన సత్కార్యాలకు పుణ్యఫలం పెంచబడినట్లే, దుష్కార్యాలకు పాప ఫలం కూడా పెంచబడింది.

"ఈ మాసాలలో మీకు మీరే అన్యాయం చేసుకోకండి" అనే వాక్యంపై వ్యాఖ్యానిస్తూ ఇమామ్ ఖతాదా (రహ్మ) ఇలా అన్నారు: "అల్లాహ్ తన దూతలలో సందేశహరునిగా ఒకరిని ఎన్నుకున్నాడు. తన వాక్కులలో అంతిమ గ్రంథంగా ఖుర్ఆన్‌ను ఎన్నుకున్నాడు. సమస్త భూమండలంలో మస్జిద్‌లను ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు. మాసాలలో రమజాను మాసాన్ని, నిషిద్ధ మాసాలను ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు. దినాలలో శుక్రవారాన్ని ఎన్నుకున్నాడు. రాత్రులలో లైలతుల్ ఖద్ర్‌ను ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్నాడు. అల్లాహ్ తాను కోరిన దానికి (కోరిన వారికి) ఉన్నతిని ప్రసాదిస్తాడు. కనుక అల్లాహ్ గొప్పగా భావించిన దానిని మీరు కూడా గొప్పగా పరిగణించండి".
(తఫ్సీర్ ఇబ్ను కసీర్)

**సోదరులారా!**
మనం సంవత్సరం పొడుగూతా దేవుని అవిధేయతకు దూరంగా ఉండాలి. మరీ ముఖ్యంగా ఈ నాలుగు నిషిద్ధ మాసాలలో అపరాధాలకు, ఆజ్ఞోల్లంఘనకు దూరంగా ఉండాలి. ఇహపరాలలో నాశనం చేసే చేష్టల నుండి మనల్ని మనం కాపాడుకోవాలి. ఎందుకంటే ఘోర అపరాధాల, అవిధేయతా చేష్టల మూలంగా అంతర్యం కలుషితమవు తుంది. హృదయానికి తుప్పు పడుతుంది. అల్లాహ్ ఏమన్నాడో చూడండి:
"ఎంత మాత్రం కాదు, అసలు వారి హృదయాలకు వారి దురాగతాల కారణంగా తుప్పు పట్టింది". (తత్ఫీఫ్: 14)
ప్రవక్త మహనీయులు (స) ఈ నేపథ్యంలో ఏమన్నారో చూద్దాం:

"విశ్వాసి (మోమిన్) పాపం చేసినప్పుడు అతని హృదయంపై ఒక నల్లని మచ్చ ఏర్పడుతుంది. మరి అతను గనక పశ్చాత్తాపం చెంది, ఆ తప్పిదానికి దూరంగా ఉంటే అది అతని హృదయాన్ని ప్రక్షాళనం చేస్తుంది. అలాకాకుండా అతను గనక యధేచ్ఛగా పాపకార్యాలు చేస్తూపోతే అతని హృదయంపైని మచ్చ పెరుగుతూ పోతుంది. చివరికి అది అతని అంతర్యాన్ని పూర్తిగా కమ్మేస్తుంది. 'తుప్పు అంటే ఇదే', దీన్ని గురించే అల్లాహ్ ఖుర్ఆన్‌లో ప్రస్తావించాడు". (తిర్మిజీ, ఇబ్ను మాజా)

జాగ్రత్త! పాపాలు చేసేవారి జీవితంలో ప్రశాంతత ఉండదు. నిత్యం వారి జీవితాల్లో వ్యాకులత, చీకు ఉంటుంది. ఈ విషయాన్ని అల్లాహ్ కూడా తన గ్రంథంలో ప్రస్తావించాడు:
"ఎవరైతే మా సన్మార్గం పట్ల విముఖత చూపుతాడో అతను ప్రపంచంలో లేమితో బాధపడతాడు. ప్రళయ దినాన మేమతన్ని గుడ్డివానిగా చేసి లేపుతాము. 'ప్రభూ! నీవు నన్ను గుడ్డివానిగా చేసి లేపావేమిటి? నాకు కంటి చూపు ఉండేది కదా!' అని అడుగుతాడు.

"నీకు ఇలానే జరగాలి. ఎందుకంటే నీ వద్దకు మా సూచనలు వచ్చినప్పటికీ నువ్వు వాటిని విస్మరించావు. కాబట్టి ఈ రోజు నిన్ను కూడా విస్మరించటం జరిగింది" అని అల్లాహ్ అంటాడు.
అంటే దైవ ధర్మం పట్ల వైముఖ్యం కనబరచి, ఖుర్‌ఆన్ సూక్తుల పారాయణం పట్ల అనాసక్తత చూపి, వాటికనుగుణంగా అవలంబించని వ్యక్తిని నలువైపుల నుంచీ దారిద్ర్యం చుట్టుకుంటుంది. అతని రోజువారి సంపాదన బాగానే ఉన్నప్పటికీ జీవితంలో శాంతి, తృప్తి కరువైపోతాయి. మరణించిన మీదట సమాధి కూడా కుంచించుకుపోతుంది. సుదీర్ఘమైన బర్జఖ్ అవస్థలో ఎన్నో కఠినమైన యాతనలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇక పునరుత్థాన దినమున అతన్ని లేపినప్పుడు కంటి చూపుతో పాటు మనో నేత్రం కూడా లేకుండా పోతుంది. దైవం మనల్ని ఈ దుస్థితి నుండి కాపాడుగాక!

అందుకే మనం అసంఖ్యాకమైన దైవానుగ్రహాలకుగాను కృతజ్ఞులమై ఉండాలి. కృతజ్ఞతకు అత్యుత్తమ మార్గం మనం దైవాజ్ఞలకు కట్టుబడి ఉండటం, అవిధేయతకు, ఆజ్ఞోల్లంఘనకు దూరంగా ఉండటమే.

## ముహర్రమ్ మాసంలో ఇంత సంతాపం

ముహర్రమ్ నెలలో కొంతమంది దుస్తులు చింపుకుంటూ, రొమ్ములు బాదుకుంటూ, కత్తులతో పొడుచుకుంటూ వికృత పద్ధతిలో సంతాపం పాటిస్తారు. మా దృష్టిలో ఇది కూడా అన్యాయం (జుల్మ్)లో ఒక రకమే. ఇది నిషిద్ధం. ఇలాంటి వికృత పోకడల గురించి దైవ ప్రవక్త (ﷺ) ఇలా హెచ్చరించారు:
"అజ్ఞానకాలపు చేష్టలలో నాలుగు చేష్టలు నా ఉమ్మత్ (అనుచర సమాజం)లో ఉంటాయి. వాటిని వదలటానికి కొంత మంది సిద్ధమవరు. జాతి (దురభిమానం) కారణంగా అహంభావం ప్రదర్శించటం, వేరొకరి వంశాన్ని గురించి చులకనగా మాట్లాడటం, నక్షత్రాల ద్వారా జాతకాలు తెలుసుకోవటం, (లేదా నక్షత్రాల ద్వారా వర్షాన్ని కోరటం), అసహ్యకరంగా రోదించి సంతాపం తెలుపటం".

ఆయన (ﷺ) ఇంకా ఇలా అన్నారు: "పెడబొబ్బలతో సంతాపం తెలిపే స్త్రీ గనక మరణించక ముందే పశ్చాత్తాపం చెందకపోతే, ప్రళయ దినాన లేపబడినప్పుడు ఆమె ఒంటిపై తారు చొక్కా ఉంటుంది. వ్యాధికి సంబంధించిన దుస్తులు ఆమె శరీరానికి ఆచ్ఛాదనగా ఉంటాయి". (ముస్లిం)
పై హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే పెడబొబ్బలు పెట్టడం, రొమ్ములు బాదుకోవటం అజ్ఞానకాలపు చేష్టల్లో ఒకటి. దీనికి ఇస్లాంతో ఎలాంటి సంబంధం లేదు. ఇలాంటి చేష్టలకు పాల్పడేవారితో తనకెలాంటి సంబంధం లేదని చెబుతూ మహా ప్రవక్త (ﷺ) ఇలా అన్నారు:
"ముఖంపై అదే పనిగా లెంపలేసుకునేవాడు, చొక్కా చింపుకుని రోదించేవాడు, అజ్ఞానకాలంలో మాదిరిగా పిచ్చిగా అరుస్తూ ఉండేవాడు, కష్టకాలంలో చావు కోసం కేకలు వేసేవాడు మా వాడు కాదు". (సహీహ్ బుఖారీ)

### ప్రియమైన పాఠకులారా!

ముహర్రమ్ నెలలో మనవారిలో చాలా మంది మహా ప్రవక్త (ﷺ) ముద్దుల మనవడైన హజ్రత్ హుసైన్ (رضي) గారి అమరగతికి సంతాప సూచకంగా 'మాతం' చేస్తుంటారు. హజ్రత్ హుసైన్ (رضي) గారి అమరగతిని తలచుకొని దుఃఖంతో విలపించని వారెవరుంటారు చెప్పండి? నిజానికి ప్రతి ముస్లిం ఈ విషాదకర సంఘటనపై బాధతో కృంగిపోతాడు. అయితే కష్టకాలంలో సదా ఓర్పుతో వ్యవహరించినట్లే హజ్రత్ ఇమామ్ హుసైన్ (رضي) వీర మరణం విషయంలో కూడా నిగ్రహంతో వ్యవహరించాలి. ఏ విలువల, ఆదర్శాల కోసం ఆ వీర పురుషుడు పోరాడారో వాటిని మనమూ పునరుద్ధరించేందుకు ప్రయత్నించాలి. అవేవీ చేయకుండా ఆవేశంతో ఊగిపోవటం, రొమ్ములు బాదుకుని మాతం చేయటం, కత్తులతో పొడుచుకుని రక్తం చిందించటం సత్యమూ కాదు, సత్సంప్రదాయమూ కాదు. "సహనం వహించేవారికి అల్లాహ్ లెక్కలేనంత పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు". (జుమర్: 10)

ఇమామ్ హుసైన్ (رضي) గొప్ప సహాబీ అన్నది నిర్వివాదాంశం. ఆయన గొప్పతనం గురించి అర్థం చేసుకోవటానికి ఆయన (رضي) మహా ప్రవక్త (ﷺ) గారి ముద్దుల మనవడు అన్న విషయం ఒక్కటి చాలు. తన మనవళ్ళయిన హసన్, హుసైన్ (رضي)లను ప్రవక్త (ﷺ) అమితమైన అవ్యాజానురాగాలతో చూసుకునేవారు. ఒక ఉల్లేఖనం ప్రకారం మహా ప్రవక్త (ﷺ) ఒకసారి తన మనవళ్ళిద్దరినీ హృదయానికి హత్తుకుని "ఓ అల్లాహ్! నేను వీరిద్దరిని ప్రేమిస్తున్నాను. కనుక నీవు కూడా వీళ్ళని ప్రేమించు" అని ప్రార్థించారు.
(ముస్నద్ అహ్మద్)

హజ్రత్ అబూ హురైరా (رضي) ఇలా తెలిపారు: ఒక రోజు దైవప్రవక్త (ﷺ) మా ఇంటికి వచ్చారు. ఆ సమయంలో హసన్ హుసైన్‌లిద్దరూ ఆయన (ﷺ) వెంటనే ఉన్నారు. ఒక భుజంపై హసన్, మరో భుజంపై హుసైన్ కూర్చొని ఉన్నారు. ప్రవక్త (ﷺ) ఒకసారి ఒక మనవణ్ణి, మరోసారి రెండో మనవణ్ణి ముద్దు పెట్టుకుంటున్నారు. ఈ వైనాన్ని గమనించిన ఒక శిష్యుడు, "ఓ దైవ ప్రవక్తా (ﷺ)! తమరు వీళ్ళని ఇంతగా ప్రేమిస్తున్నారా?" అని అడగనే అడిగేశాడు. మహాప్రవక్త (స) ఈ మాటకు సమాధానమిస్తూ "ఎవరైతే వీళ్ళని ప్రేమించాడో అతను నన్ను ప్రేమించాడు. ఎవరైతే వీళ్ళని ద్వేషించాడో అతను నన్ను ద్వేషించాడు" అన్నారు. (అహ్మద్)

ఈ విధంగా చెప్పుకుంటూపోతే ప్రవక్త మనుమల గొప్పతనాన్ని సూచించే హదీసులు ఇంకా ఎన్నో వస్తాయి. ఈ హదీసుల దృష్ట్యా మనమంతా హసన్‌హుసైన్‌లను హృదయపూర్వకంగా ఆదరించాలి. హజ్రత్ హుసైన్ (رضي) అమరగతి చరిత్రలో అత్యంత విషాదకరమైన సంఘటనే. కాని ఏటేటా ముహర్రమ్ నెలలో ఆ సంఘటనను తలచుకుని చేసే పనులు మాత్రం ధర్మసమ్మతం కావు. స్వయంగా మన ప్రవక్త (ﷺ) అలాంటి చేష్టలను అధర్మంగా ఖరారు చేశారు.

అందుకే హజ్రత్ హుసైన్ (رضي) గారి వీర మరణాన్ని దేవుని విధివ్రాతగా భావించాలి. ఈయన తండ్రి హజ్రత్ అలీ (رضي) గారి వీర మరణం కూడా విధి వ్రాత ప్రకారమే జరిగింది. హిజ్రీ శకం 40వ సంవత్సరం రమజాను నెల 17వ తేదీ ఉదయం ఫజ్ర్ నమాజు కోసం వెళుతూ దైవ మార్గంలో అమరగతి నొందారు అమీరుల్ మోమినీన్ హజ్రత్ అలీ (رضي). అంతకు మునుపు తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (رضي) దుర్మార్గుల చేతుల్లో అమానుషంగా వధించబడ్డారు. హిజ్రీ శకం 36వ ఏట జుల్‌హిజ్జా నెల తష్రీఖ్ దినాలలో ఈ విషాదకర సంఘటన జరిగింది. అంతకు ముందు ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (رضي) కూడా అమరగతినొందినవారే. అమరగతికి నోచుకున్న ఈ ముగ్గురు ఖలీఫాలు నిశ్చయంగా హజ్రత్ హుసైన్ (رضي) కన్నా శ్రేష్ఠులే. కాని ఇలాంటి ఘటనలు సంభవించినపుడు మనం ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్ (మేము అల్లాహ్‌కు చెందిన వారము. నిశ్చయంగా మేము మరలిపోవలసింది ఆయన సన్నిధికే) అని అనటం తప్ప మరేమనగలం?

(మిగతాది వచ్చే సంచికలో)

అబుల్ హసన్

# దయా సాగరుడు



అల్లాహ్ జాలి, కరుణ, ప్రేమ, దయ, దీర్ఘ శాంతము, విస్తారమైన కృపా గుణములు గల దేవుడు. ఆయన సమస్త ప్రాణుల పట్ల కృప చూపువాడు. దోషమును, పాపాన్ని, అపరాధాన్ని క్షమించువాడు. అయితే ఆయన దోషులను నిర్దోషులుగా, విశ్వాసులను అవిశ్వాసులుగా, సత్యవంతులను అసత్య వాదులుగా, శాంతి కాముకులను శాంతి విఘాతకులుగా, సాత్వికులను మౌఢ్యులు, తామసికులుగా ఏ మాత్రం ఎంచడు. అల్లాహ్ అధిక స్తోత్రాలకు అర్హుడు. అన్ని విధాలా పొగడ్తలు సర్వ లోకాలకు ప్రభువైన అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన మహాత్మ్యము గ్రహింపశక్యము కానిది. రాజాధిరాజు అయిన అల్లాహ్ దయా దాక్షిణ్యాలు గలవాడు. ఆయన దీర్ఘ శాంతుడు. కృపాగుణము గలవాడు. ఆయన అందరికీ ప్రభువు, మహోపకారి. ఆయన కారుణ్య వాత్సల్యాలు, కనికరములు సమస్త సృష్టి మీద ఉన్నాయి. కనుకనే ఆయన ఖుర్ఆన్ వంటి మహత్తర, మహిమాన్విత, మహోన్నత, మహోజ్వల గ్రంథాన్ని మానవాళికి అందజేశాడు.

**"మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి హితోపదేశం వచ్చేసింది. అది హృదయ రుగ్మతలకు స్వస్థత, నివారిణి. గ్రహీతల పాలిట మార్గ దర్శకత్వం, కారుణ్యం. (ప్రవక్తా! వారికి) చెప్పు: అల్లాహ్ తన ప్రత్యేక అనుగ్రహం వల్ల, తన విశేష కారుణ్యం వల్ల దానిని పంపాడు. అందుగ్గాను ప్రజలు సంబర పడాలి. జనులు కూడబెట్టే వాటన్నింటి కంటే అది ఎంతో మేలైనది".**

**(దివ్యఖుర్ఆన్– 10: 57,58)**

–'అల్లాహ్ 70 తల్లుల కన్నా ఎక్కువ ప్రేమ గలవాడు' అన్నారు ప్రవక్త (ﷺ). అల్లాహ్‌కు క్షమించడం ప్రియం. శిక్షించడం అప్రియం. అయితే బహు దైవారాధన (షిర్క్)ను మాత్రం ఆయన ఎన్నటికీ క్షమించడు.

## మొరలనాలకించు మహోన్నత ప్రభువు అల్లాహ్

సార్వభౌమాధికారి అయిన అల్లాహ్ పడిపోయిన వారందరినీ ఉద్ధరించువాడు. క్రుంగిపోయిన వారందరినీ చేయూత నిచ్చేవాడు. సమస్త ప్రాణులు ఆయన మీదే ఆధారపడి ఉన్నాయి. సమస్త జీవుల నేత్రాలు ఆయన వైపే ఆశతో చూస్తున్నాయి. సకాలంలో వాటన్నిటికి ఆహారం అందేలా చేసేవాడు అల్లాహ్‌యే. ఆయన తన కృపతో ప్రతి జీవి కోరికను తీరుస్తున్నాడు. తన దాసులతో కృపతో వ్యవహరించేవాడు. తనను మొర పెట్టుకునే వారందరికీ అత్యంత సమీపముగా ఉండేవాడు. తనయందు భయభక్తులు కలవారి మనోరథాన్ని ఆయన ఈడేరుస్తాడు. వారి మొరలను ఆలకించి వారిని కాపాడుతాడు. తన్ను ప్రేమించే వారందరినీ కీడు నుంచి రక్షిస్తాడు. అయితే దుర్మార్గులను ఆయన శిక్షిస్తాడు.

మనం కూర్చోడం, లేవడం ఆయనకు తెలుసు. మనలో తలంపు పుట్టక ముందే ఆయన మన అంతరంగాన్ని గ్రహిస్తున్నాడు. మన నడకను, నడ వడికను, ప్రవర్తనను, పరివర్తనను ఆయన పరిశీలిస్తున్నాడు. మన బాధల గురించి ఆయన బాగా తెలిసినవాడు. మన నోట మాట రాక పూర్వమే మన ఉద్దేశాలను ఆయన పసిగడతాడు. ఆయన మనల్ని అన్ని దిశల నుండి ఆవరించి ఉన్నాడు. ఆయన దూతలు మనల్ని నిరంతరం కనిపెట్టుకొని ఉన్నారు. మన చర్య ప్రతి చర్యలను కిరామన్ కాతిబీన్, రఖీబ్ - అతీద్‌లు లిఖిస్తున్నారు. ఆయన దీవెనలు సదా సత్యవంతులకు ఉంటాయి. ఆయన సన్నిధి, ఆజ్ఞాపరిధి నుండి మనం ఎక్కడికి పారిపోగలము? మనం పక్షుల్లా ఆకాశ వీధిలో విహరించిననూ ఆయన అక్కడ ఉన్నాడు. పాతాళంలో నిద్రిస్తున్నా అక్కడ ఉన్నాడు. మనకు చీకటి అన్పించేది ఆయనకు పగటి వెలుగుగా ఉంటుంది. ఆయనకు వెలుగు చీకట్లు రెండూ ఏకరీతిగా ఉంటాయి. మన తల్లి గర్భమున మనల్ని నిర్మించినవాడు, అందంగా మన ఆకారాల్ని మలచినవాడు ఆయనే. ఆయన కార్యాలన్నీ ఐహా విచిత్రమైనవి. ఆశ్చర్యానికి గురి చేసేవి. ఆయనే మనల్ని మూడేసి చీకటి పొరల లోపల - మాతృగర్భాల్లో ప్రాణం పోసింది. మనకు చెవులిచ్చినవాడు, కళ్ళిచ్చినవాడు, హృద యాలిచ్చినవాడు ఆయనే. రేపు ప్రళయ దినాన మానవుని కుళ్ళిపోయిన ఎముకల్ని జత చేయువాడు, అతని వ్రేళ్ళ కొనలను సైతం సముచితమైన రీతిలో రూపొందించగల సమర్థుడు అల్లాహ్. మన జీవిత క్షణాలన్నీ ఆయన గ్రంథంలో నమోదయి ఉన్నాయి. మన దేహ నిర్మాణం గురించి ఆయన అందజేసిన సమాచారం ఐహా వైజ్ఞానికంగా తోస్తుంది. చూడండి:

"మేము మానవుణ్ణి మట్టి యొక్క సారంతో సృష్టించాము. తర్వాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము.. ఆ తర్వాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము. ఆపైన ముద్దను కండగా చేశాము. ఆ తర్వాత మాంసపు కండను ఎముకలుగా చేశాము. ఆ తర్వాత ఎముకలకు మాంసాన్ని తొడిగించాము. ఆపైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. సృజనకారులందరిలోకెల్లా ఉత్తమ సృజన కారుడు". (దివ్య ఖుర్‌ఆన్- 23: 12-14)

కాబట్టి, మనం అల్లాహ్ వాక్కును శ్రద్ధగా విని, శ్రవణానందంతో దాని మృదు మాధుర్యాన్ని ఆస్వాదించి, ఆయన కిష్టమైనది, ఆయన దృష్టిలో న్యాయమైనది చేసి, ఆయన ఆజ్ఞలకు విధేయులై, ఆయన కట్టుదులన్నింటినీ శిరసావహించిన యెడల ఆయన మనల్ని అన్ని విధాలా కాపాడి సంరక్షిస్తాడు. మన మొరలను ఆలకిస్తాడు. ఒకవేళ మనం అధర్మమైనది తింటూ, తొడుగుతూ, త్రాగుతూ, త్రుళ్ళుతూ దైవాన్ని వేడుకుంటే ఆయన మన మొరల్ని ఆలకించకపోగా, మనపై శిక్షాగ్నిని కురిపిస్తాడు. కనుక వీలైనంత త్వరగా మనం ఆయన వైపునకు మరలాలి. ఆయన్ను క్షమించమని ప్రాధేయపడాలి. ఆయన మనకు ఇలా పిలుపునిస్తున్నాడు:

(ఓ ప్రవక్తా! నా తరఫున వారికి ఇలా) చెప్పు: "తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టిన ఓ నా దాసులారా! మీరు అల్లా కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ పాపాలన్నింటినీ క్షమిస్తాడు. నిజంగా ఆయన అమితంగా క్షమించేవాడు. అపారంగా కరుణించే వాడు". (జుమర్: 53)

"(ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని మొరను ఆలకించి ఆమోదిస్తానని (నువ్వు వారికి చెప్పు). కాబట్టి వారు నా ఆదేశాల్ని శిరసావహించాలి. నన్ను విశ్వసించాలి. తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందగలరు".


(అల్ బఖరా: 186)

## నీతిని ప్రేమించే నిజ దేవుడు అల్లాహ్

సర్వోన్నతుడైన అల్లాహ్ నీతిమంతులను పరికిస్తాడు. ప్రేమిస్తాడు. దుష్టులును, బాలాత్కారాసక్తులును ఆయనకు అప్రియము, అసహ్యము. దుష్ట జనుల మీద ఆయన శిక్షాగ్ని కురిపిస్తాడు. అగ్ని గంధకములును వడగాలియు వారికి పానీయ భాగమవుతాయి. సార్వ భౌమాధికారి అయిన అల్లాహ్ నీతి మంతుడు. ఆయన నీతిని, న్యాయాన్ని ప్రేమిస్తాడు. యదార్థవంతులు, సత్య ప్రియులు రేపు ప్రళయ దినాన స్వర్గంలో ఆయన ముఖ దర్శనము చేస్తారు.



# నెలవంక ఉత్తరాలు




## తీర్చలేనిది తల్లి రుణం

సోదర సోదరీమణులకు నా విన్నపం - తల్లి సేవ ఎప్పటికీ పూర్తి కాదు. ఉదాహరణకు:- తల్లి మన చిన్నతనంలో చేసిన సేవ మనం ఆమె చివరి శ్వాస వరకు చేసినా ఆ సేవకు సమానం కాదు. ఆమె మనల్ని ఉగ్గుపాల నుంచి మనకు ఊత కర్ర చేతికి వచ్చే వరకు ప్రేమిస్తూనే ఉంటుంది. మనకు ఆకలి అయినప్పుడు మన ముఖ కవళికలు గమనించి, మన అవసరాలను మనం అడగక ముందే తీర్చిన తల్లికి ఆమె రుణం చివరి దశలో ఏ విధంగా తీర్చు కుంటున్నామో ఒక సారి మననం చేసుకోవాలి.

మనం నోరు తెరచి అడగక ముందే మన అవసరాలు తీర్చిన తల్లికి ఆవిడ అవసాన దశలో మనల్ని నోరు తెరచి 'ఇది కావాలి' అని అడిగినా 'నావల్ల కాదు' అని చెప్పడానికి నోరు ఎలా వస్తుందో కాస్త ఆలోచించాలి.

ఈ కాలపు యువతీ యువకులను ఒకసారి గమనిస్తే బాధ్యతలు ఏ విధంగా నిర్వర్తిస్తున్నారో తెలిసివస్తుంది. తల్లి పాదాల చెంత స్వర్గముంది అని అంటే దానికి ఒక వితండవాది నాకు అవి కనబడలేదని అంటాడు. తల్లికి ఏమన్నా ఇవ్వాలంటే భార్యను అడగాలని కొడుకు, మా వారిని అడగాలని కూతురు అంటారు. కాని తల్లి మనల్ని పోషించే సమయంలో ఎవరినీ సంప్రదించకుండానే మన అవసరాలను తీర్చి, పెంచి, పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పించి ఇంత వాళ్ళను అంత వాళ్ళుగా చేసింది. నలుగురిలో మన ఉనికికి కారణమైన తల్లిని ఆ నలుగురిలో నవ్వులపాలు చేయడం ఎంతవరకు సబబు? తల్లిదండ్రులలో తల్లే ఎక్కువ ప్రేమపాత్రురాలు, మన సేవకు అర్హురాలు.

కాబట్టి ప్రతి విశ్వాసి తల్లితో తియ్యగా మాట్లాడాలి. ఆమె అన్నపానీయాల పట్ల శ్రద్ధ వహించాలి. మీరు ఎంత ఉన్నత పదవిలో ఉన్నా తల్లికే మొదటి స్థానం ఇవ్వాలి.

కనీసం కలలోనైనా ఆమె పట్ల దురభిప్రాయం రాకూడదు.

ప్రతి ఒక్కరూ అల్లాహ్‌ను దుఆ చేయాలి. (తమలో చెడు తలంపుక చెడు ప్రవర్తన రాకుండా చూడమని). ఆమీన్ యా రబ్బల్ ఆలమీన్.

- అయిషా (ఉమా మహేశ్వరి)
(రౌదా)

## ఎవరు అతను?

ఓ బాటసారీ! నువ్వు సాగిపోతున్న జీవన సాగరంలో ఎంతసేపటికీ నీ గురించి, నీ ఐహిక సుఖాల గురించి ఆలోచిస్తున్నావే. ఇవి ఇహలోకానికే పరిమితము. పరలోకం అనేది ఇంకొకటి ఉన్నది అని ఎప్పుడైనా ఆలోచించావా?

ప్రతి దాని గురించి నీవు మాట్లాడుతావు. చావు - బ్రతుకు, కష్టాలు-సుఖాలు, కోపము-శాంతము, పుట్టుట-గిట్టుట. ఇవన్నీ ఎవరి వలన జరుగుతున్నాయి? ఏ విధంగా జీవితాన్ని సాగిస్తున్నావు? ఇవన్నీ ఎవరి చలువతో జరుగుతున్నాయి అని ఆలోచించవే! ఏ రాయి కనిపించినా, ఏ విగ్రహం ఎదురుపడినా దానికి ఏదేదో చేస్తావు. ఎన్నో కోర్కెలు వెలిబుచ్చి వాటిని తీర్చమని కోరుతావు. ఏమిటి ఇది? ఆ రాయిని కోర్కెను తీర్చుతుందా? ఈ సృష్టికి కారకుడెవరో ప్రశాంతంగా ఆలోచించు. అతను లేనిదే ఈ సృష్టి లేదు. అతను లేనిదే సమస్యకు పరిష్కారం దొరకదు. అందుకే ప్రతి ఒక్కరు ఆ నిజ స్వామిని తెలుసుకుని అతనికే సాష్టాంగపడాలి. సృష్టికర్త ఒక్కడే. అయనే అల్లాహ్.

- మహమ్మద్ రిజ్వాన్
(మాలియా)

## అదిగో! నెలవంక!!

### (ఇద్దరు పాఠకుల సంభాషణ)

**అతడు:** అదిగో ఇంకో **నెలవంక**
ఎవరిదీ నెలవంక?
**ఆమె:** అడగాలా? అది నీదీ నాదీ
మన భావి సౌఖ్యాల పునాది
**అతడు:** ఈ **నెలవంక** మనకిచ్చేదేమిటి?
నెలనెలకి తెచ్చేదేమిటి?
**ఆమె:** నెలనెలా వందు వెన్నెల్ని తెస్తుంది
విద్యా వెలుతురు కానుకలిస్తుంది
**అతడు:** వెలుతురు వెనకే చీకటి లేదా?
ఉషస్సు చాటునే తమస్సు లేదా?
సుఖాల వెంబడి దుఃఖం రాదా?
**ఆమె:** దుఃఖంలో ఆశా దీపిక **నెలవంక**
చీకటిలో తారా గీతిక **నెలవంక**
ఉషస్సుతో తమస్సు పోరి గెలవలేదు
**అతడు:** ఎవరి కోసమూ ఆగదీ నిమిషము
**ఆమె:** నిమిషములోనే మారును లోకము
**అతడు:** **నెలవంక** మనదే వెన్నెల మనదే
**ఆమె:** అది తెచ్చే శుభ సందేశాలన్నీ మనవే

- శాంతి ప్రియ

# వివేచన

అద్దం ఎంతో నిజాయితీ గలది. అద్దం శ్రేయోభిలాషి. అది ఎందులోనూ హెచ్చుతగ్గులు చేయదు. ఉన్నదున్నట్టుగా చూపెడుతుంది. అద్దం మాట్లాడదు. అద్దం ఉపన్యాసాలివ్వదు. అది నిశ్శబ్దంగానే చూసేవారికి హితబోధ చేస్తుంది. అద్దం పరోక్ష నిందకు పాల్పడదు. అది చాడీలు చెప్పదు. అద్దానికి మొహమాటం ఉండదు. అద్దం ఏం చెప్పాలన్నా మొహం మీదే చెప్పేస్తుంది. అందుకే అంతిమ దైవ ప్రవక్త (ﷺ) వారన్నారు –


“ఒక విశ్వాసి మరో విశ్వాస సోదరునికి అద్దం లాంటి వాడు”.

(అబూ దావూద్)

కాబట్టి మనం అద్దాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అద్దం నుంచి స్ఫూర్తి పొందాలి. సాటి సోదరులలోని లోపాలను ఎత్తి చూపేటప్పుడు గోరంతల్ని కొండంతలుగా చేయకూడదు.



# చార్మినార్



విశ్వ విఖ్యాత చారిత్రక కట్టడాలలో ఇదొకటి. భారత ప్రాచీన చిహ్నాలలో ఎన్నదగ్గ ఈ కట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాజధాని నగరమైన హైదరాబాదుకే తలమానికం. హైదరాబాదు నగర నిర్మాత అయిన ముహమ్మద్ కులీ కుతుబ్ షాహ్ 400 ఏండ్ల క్రితం (1591లో) చార్మినార్ నిర్మించాడు. చార్మినార్ అంటే నాలుగు మీనార్లు అని అర్థం. దీని ఎత్తు 48.7 మీటర్లు. ప్లేగు వ్యాధి నిర్మూలనకు చిహ్నంగా నిర్మించబడిన ఈ కట్టడం నిర్మాణ తీరుకు ప్రపంచ ఆర్కిటెక్టులు అబ్బుర పడుతుంటారు. ఈ కట్టడంపైన 45 మంది నమాజ్ చేసుకోవటానికి వీలుగా ఒక మస్జిదు కూడా నిర్మించబడి ఉంది.



